




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ 5 శుక్రవారం సెప్టెంబర్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 352
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


### మా బంధం దౌత్యానికి మించినది:సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు



2

### రాజకీయ కుటుంబ కథాచిత్రం: ఒకరికి పదవి పాయే.. మరొకరికి పార్టీ



2

### ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంప విలయం



2

## రూ. 51 లక్షలు పలికిన
# గణేశుడి లడ్డూ

- రాయదుర్గంలో లడ్డూ వేలంపాట హంగామా
- రూ. 51.77 లక్షలకు గణేశుడి లడ్డూ
- ఇల్లందుకు చెందిన గణేష్‌కు బంపర్ బిడ్
- గత ఏడాది రికార్డు బద్దలైన రాయదుర్గం లడ్డూ
- వ్యాపారవేత్తల పోటీలో భక్తి ఉత్సాహం
- బాలాపూర్ లడ్డూ చరిత్రకు సవాల్
- లడ్డూతో అదృష్టం కలుగుతుందని భక్తుల నమ్మకం
- వినాయక ఉత్సవాలకు రికార్డు ధరల ప్రాధాన్యం



హైదరాబాద్-నవభూమిబ్యూరో

వినాయకుడి పండుగ అంటే అందరికీ గుర్తుకొచ్చేది భారీ గణపతి విగ్రహాలతో పాటు లడ్డూ వేలం పాటలు కూడా. తెలుగు రాష్ట్రాల్లో గణేశుడు అంటే ఖైరతాబాద్, గణేశుడి లడ్డూ అంటే బాలాపూర్ గణేష్ లడ్డూ గుర్తుకు వస్తుంది. బాలాపూర్ గణేష్ లడ్డూ వేలంలో రికార్డు ధర పలకడం దశాబ్ధాల చరిత్ర. అయితే గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాల్లో కూడా లడ్డూ వేలం పాటలు ఆసక్తిని రేపుతున్నాయి. తాజాగా రాయదుర్గం లో జరిగిన గణేశుడి లడ్డూ వేలంపాట చరిత్ర సృష్టించింది. పాకిస్థాన్‌కు సినిమా చూపించిన భారత సైన్యం రాయదుర్గం లడ్డూ రికార్డు ధర హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో ఉన్న మైహోమ్ భుజాలో గణేశుడి లడ్డూ వేలంలో అంచనాలకు మించి ధర పలికింది. ఇల్లందుకు చెందిన గణేష్ అనే వ్యక్తి ఈ లడ్డూను ఏకంగా రూ.51,77,777కు దక్కించుకున్నారు. ఇది అత్యంత భారీ మొత్తం. గత ఏడాది ఇదే లడ్డూ రూ.29 లక్షలు పలికింది. ఆ వేలంలో కూడా గణేష్ అనే వ్యక్తే లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈసారి గత రికార్డును దాదాపు రెట్టింపు చేసి, కొత్త రికార్డును నెలకొల్పారు. 2024లో రూ. 29 లక్షలు పలకగా.. 2023లో 25.50 లక్షలు పలికింది. 2023లో చిరంజీవి గౌడ్ అనే వ్యాపారవేత్త దక్కించుకున్నారు. 2022లో రూ. 20.50 లక్షల ధరకు వ్యాపారవేత్త సత్తిబాబు దక్కించుకున్నారు. చరిత్రలో బాలాపూర్ లడ్డూ బాలాపూర్ గణేష్ లడ్డూ వేలంపాట దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే. ఇది కొన్ని లక్షలు, కోట్ల రూపాయల ధర పలకడం మనం చూశాం. గత ఏడాది బాలాపూర్ లడ్డూ దాదాపు రూ.25 లక్షలు పలికింది. అయితే, రాయదుర్గం లడ్డూ దాని రికార్డును అధిగమించి, ఈ సంవత్సరం అత్యధిక ధర పలికిన లడ్డూగా నిలిచింది. భక్తులు లడ్డూను దక్కించుకోవడానికి ఇంత భారీ మొత్తాలు ఖర్చు చేయడానికి కారణం, అది తమకు అదృష్టం, శ్రేయస్సు, మంచి ఆరోగ్యాన్ని తెస్తుందని నమ్మడమే.

గణేశ్ ఉత్సవాలు కేవలం భక్తి, ఆరాధనతో పాటు ఇలాంటి ఆసక్తికరమైన సంప్రదాయాలకు వేదికగా నిలుస్తున్నాయి. రికార్డు ధరలు పలికిన ఈ లడ్డూ వేలంపాటలు, ఉత్సవాలకు మరింత ప్రాధాన్యతను, కవరేజీని తీసుకువస్తున్నాయి.

## కూటమికి
# బిగ్ షాక్!

### ఎన్డీయే నుంచి వైదొలిగిన ప్రధాన పార్టీ

- ఎన్డీఏ కూటమికి తమిళనాడులో ఎదురుదెబ్బ
- ఎన్డీఏ నుంచి వైదొలుగుతున్నట్లు అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రకటన
- ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించిన పార్టీ ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్

2



చెన్నై-నవభూమిబ్యూరో

దేశంలో వరుసగా మూడోసారి అధికారం చేపట్టిన ఎన్‌డిఎకు బిగ్ షాక్ తగిలింది. ఎన్‌డిఎ నుంచి ప్రధాన పార్టీ బయటకు వచ్చేసింది. తమిళనాడుకు చెందిన ప్రాంతీయ పార్టీ 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' పార్టీ కూటమి నుంచి వైదొలిగింది. దీనిపై ఆ పార్టీ అధినేత టీటీవీ దినకరన్ కీలక ప్రకటన చేశారు. ఆయన మాట్లాడుతూ..తమ పార్టీ ఇకపై ఎన్డీయే లో భాగస్వామ్యం కాదని ప్రకటించారు. 2026 ఎన్నికల ముందు తమ పార్టీ ఎవరితో పొత్తు పెట్టుకోవాలనేది పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటామని టీవీ దినకరన్ తెలిపారు. అన్నాడీఎంకే నుంచి బయటకు వచ్చిన టీటీవీ దినకరన్ 2018లో 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' పార్టీని స్థాపించారు. అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం, పార్టీపై వ్యతిరేకతతో ఈ పార్టీని ఏర్పాటు చేశారు. అన్నాడీఎంకే నుంచి విడిపోయిన తర్వాత దినకరన్ ఆర్కే నగర్ ఉపఎన్నికలో భారీ మెజారిటీతో గెలిచి, అప్పటి పాలక పక్షానికి

## కామారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- వరద నష్టంపై కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి సమీక్ష



2లో

## తెలంగాణ జాగృతిలో
# ముసలం

### కవితపై సొంత నేత తీవ్ర వ్యాఖ్యలు

- సంస్థ అధ్యక్షురాలు కవితపై అసంతృప్తి వ్యక్తం చేసిన నాయకులు
- తాము ఎప్పటికీ కేసీఆర్‌కే కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ
- కవిత నిర్ణయాలతో కార్యకర్తల భవిష్యత్తు ప్రశ్నార్థకమన్న నేతలు
- కవిత సామాజిక న్యాయంపై కీలక నేత రాజీవ్ సాగర్ ప్రశ్నలు
- జాగృతి ఆశయాలు పక్కదారి పడుతున్నాయని ఆరోపణ



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సాంస్కృతిక సంస్థ తెలంగాణ జాగృతిలో అంతర్గత విభేదాలు రాజుకున్నాయి. సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంపై ఆ సంస్థకు చెందిన కీలక నేత మేడే రాజీవ్ సాగర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తామంతా కేసీఆర్ కోసమే పనిచేస్తామని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కవిత తీసుకుంటున్న నిర్ణయాల వల్ల సంస్థలోని కార్యకర్తల భవిష్యత్తు అంధకారంలో పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాజీవ్ సాగర్ మాట్లాడుతూ, "తెలంగాణ జాగృతి నాయకులమైన మేము ఎల్లప్పుడూ కేసీఆర్ కోసమే పని చేస్తాం. ఆయన నిర్ణయమే మాకు శిరోధార్యం. కానీ, కవిత గారు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల 19 ఏళ్లుగా సంస్థ కోసం కష్టపడిన వారి జీవితాలు, రాజకీయ భవిష్యత్తు ఏం కావాలి?" అని ప్రశ్నించారు. జాగృతి సంస్థ కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఆశయాల కోసం పనిచేయాలని, కానీ ఇప్పుడు ఎవరి కోసం, ఎవరి ఆశయాల కోసం పనిచేస్తోందో అర్థం కావడం లేదని విమర్శించారు.సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న కవితకు రెండుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశాలు వచ్చాయని గుర్తు చేశారు. ఆమె వెనుక నడిచిన కార్యకర్తలకు ఎలాంటి సామాజిక న్యాయం జరిగిందని నిలదీశారు. కవిత వ్యక్తిగత ఎజెండాతో పనిచేస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. రాత్రింబవళ్లు మేం కవిత చెప్పినట్లు పని చేశామని, కానీ ఆమె తీసుకున్న నిర్ణయం పట్ల తామంతా బాధ పడుతున్నామని అన్నారు. కవిత చేసిన పని వల్ల మా జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## జయశంకర్ భూపాలపల్లిలో
# దారుణం

### ప్రియుడి కోసం భర్త, కుమార్తెను బలి చేసిన తల్లి

- అటవీ ప్రాంతంలో యువతి మృతదేహం గుర్తింపు
- తల్లి కవితపై పోలీసుల అనుమానం
- ప్రియుడు రాజ్‌కుమార్‌తో సంబంధం
- పక్షవాతం కారణంగా మంచానికే పరిమితమైన భర్త
- భర్తను గొంతు నులిమి హతమార్చిన భార్య, ప్రియుడు
- తండ్రి హత్య విషయం తెలిసిన కుమార్తె వర్షిణి
- ప్రియుడితో కలిసి కూతురినీ హతమార్చిన తల్లి

2



జయశంకర్ భూపాలపల్లి-నవభూమిబ్యూరో

ప్రియుడి మోజులో పడి భర్తను, కన్నబిడ్డను హతమార్చింది ఓ ఇల్లాలు. మూడు నెలల వ్యవధిలో భర్తను, కన్న బిడ్డను హతమార్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామంలో ఆలస్యంగా

## తెలంగాణలో మూడు రోజులు
# వర్షాలు

### ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..!



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణలో పలుచోట్ల రాగల మూడురోజులు అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తూర్పు మధ్య ప్రదేశ్ వరకు వ్యాపించిందని.. అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి దిశగా వంగి ఉందని తెలిపింది. రాబోయే 24గంటల్లో తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది.

అలాగే, సగటు సముద్రమట్టం వద్ద రుతుపవన ద్రోణి జైసల్మేర్, కోట, నర్మదాపురం, సియోని, చాంద్‌బలీ మీదుగా అల్పపీడన ప్రాంతం కేంద్రం మీదుగా తూర్పు ఆగ్నేయం వైపు వాయువ్య బంగాళాఖాతం వరకు విస్తరించి ఉందని.. సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి.. ఉపరితల ఆవర్తనంగుండా ప్రయాణిస్తుందని పేర్కొంది. దక్షిణ గుజరాత్, సౌరాష్ట్ర మీదుగా ద్రోణి ఈశాన్య అరేబియా సముద్రం నుంచి వాయువ్య బంగాళాఖాతం వరకు ప్రయాణిస్తుందని.. మధ్యప్రదేశ్, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఉందని వివరించింది.గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి,

# కవిత అబద్ధం చెప్పారు

### హరీశ్ వల్ల కాదు, కేసీఆర్ వల్లే బీఆర్ఎస్‌ను వీడా: కొండా విశ్వేశ్వర్ రెడ్డి



హైదరాబాద్-నవభూమిబ్యూరో

బీఆర్ఎస్ పార్టీ నుంచి విజయశాంతి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్ వంటి నేతలు బయటకు వెళ్లిపోవడానికి మాజీ మంత్రి హరీశ్ రావు కారణమంటూ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కవిత ఆరోపణల్లో వాస్తవం లేదని, తాను బీఆర్ఎస్‌ను వీడటానికి కేసీఆర్, కేటీఆరే కారణమని ఆయన స్పష్టం చేశారు. హరీశ్ రావు వల్ల తాను పార్టీని వీడలేదని తేల్చి చెప్పారు."కేసీఆర్, కేటీఆర్ అహంకారం, వారి అవినీతి భరించలేకే నేను బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాను. కవిత ఇప్పుడు అమాయకురాలిలా మాట్లాడుతున్నారు. ఆమె అవినీతికి పాల్పడలేదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఒకే కుటుంబం రాష్ట్రాన్ని పాలించిందని, దాని ఫలితంగానే పార్టీ నుంచి నేతలు వెళ్లిపోవాల్సి వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపైనా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి మొత్తం కేసీఆర్‌దేనని ఆరోపించారు. ఆ ప్రాజెక్టు విషయంలో హరీశ్ రావు పాత్ర కేవలం సంతకాలు పెట్టడానికే పరిమితమైందని కొండా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, కవితను బీజేపీ వైపు కూడా చూడనివ్వబోమని ఆయన తేల్చిచెప్పారు.

## ఏపీ ప్రజలకు సూపర్ న్యూస్..
# ఒక్కో ఫ్యామిలీకి ఏడాదికి 25 లక్షలు

- కీలక నిర్ణయాలు వెల్లడించిన ఏపీ క్యాబినెట్
- యూనివర్సల్ హెల్త్ పాలసీకి గ్రీన్ సిగ్నల్
- 1.63 కోట్ల కుటుంబాలకు లబ్ధి
- 2493 ఆసుపత్రుల్లో 3257 రకాల చికిత్సలు
- ఫ్రీ ఆథరైజేషన్ సదుపాయం..6 గంటల్లో అప్రూవల్

2



అమరావతి-నవభూమి ప్రతినిధి

ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో నేడు క్యాబినెట్ భేటీ జరిగింది ఈ భేటీలో ఏపీ ప్రజలకు సర్కార్ భారీ శుభవార్త చెప్పింది. యూనివర్సల్ హెల్త్ పాలసీ కి చంద్రబాబు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య భీమా కల్పించనుంది. ఒక్కో కుటుంబానికి ప్రతి సంవత్సరం 25 లక్షల రూపాయల ఉచిత వైద్య చికిత్సలను అందించే కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది.

**యూనివర్సల్ హెల్త్ పాలసీకి ఏపీ కేబినేట్ ఆమోదం**

ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం నేడు పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది.

## సుప్రీంకోర్టులో పిన్నెల్లి
# సోదరులకు ఊరట

- పల్నాడు జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులకు ఊరట
- తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు అరెస్ట్ చేయవద్దన్న సుప్రీంకోర్టు
- ఏపీ ప్రభుత్వానికి, ప్రతివాదులకు నోటీసులు జారీ

2

## ముగ్గురు పిల్లల్ని పెట్రోల్ పోసి తగులబెట్టి
# ఆపై తండ్రి ఆత్మహత్య

- నాగర్‌కర్నూలు జిల్లాలో కల్వకుర్తి మండలంలో ఘటన
- భార్యతో గొడవపడి గత నెల 30న పిల్లలతో బయటకు వెళ్లిన వెంకటేశ్వర్లు
- ముగ్గురు పిల్లలను పెట్రోల్ పోసి తగులపెట్టినట్లు గుర్తించిన పోలీసులు
- ఆ తర్వాత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న వెంకటేశ్వర్లు

2



నాగర్‌కర్నూలు-నవభూమి ప్రతినిధి

తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా భర్త ఆత్మహత్య చేసుకోగా, అదృశ్యమైన ముగ్గురు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వెల్దండ మండలంలో ఎరువుల దుకాణం నిర్వహిస్తున్న గుత్తా వెంకటేశ్వర్లు భార్యతో గొడవపడి గత నెల 30న ముగ్గురు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్ళాడు.వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ శివారులో వెంకటేశ్వర్లు మృతి చెంది కనిపించాడు. అతని పక్కనే పురుగుల మందు డబ్బా ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, ముగ్గురు పిల్లల ఆచూకీ లభించలేదు. డిండి ప్రాజెక్టు పరిసరాల్లో తండ్రి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంచరించినట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యమైన తర్వాత, చిన్నారుల ఆచూకీ గురువారం ఉదయం వరకు తెలియరాలేదు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఉప్పునుంతల మండలం సూర్యా



# తిరుపతి వెంకన్న దర్శనానికి వెళ్లేవారికి గుడ్‌న్యూస్.. ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!




**హైదరాబాద్-నవభూమి:** దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. రాబోయే దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను పొడిగించినట్లు పేర్కొంది. చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను నవంబర్ వరకు పొడిగినట్లు చెప్పింది. చర్లపల్లి-తిరుపతి (07013) రైలు సెప్టెంబర్ 9 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి మంగళవారం రాకపోకలు సాగిస్తుందని తెలిపింది. రైలు ఆయా రోజుల్లో రాత్రి 9.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పింది. తిరుపతి-చర్లపల్లి (07014) రైలు సెప్టెంబర్ 10 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి బుధవారం రాకపోకలు సాగిస్తుందని.. ఆయా రోజుల్లో సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని వివరించింది. రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడ, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, వినుకొండ, దొనకొండ, మార్కాపూర్, కంభం, గిద్దలూరు, నంద్యాల, కోయికంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూర్, యెర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, నందలూర్, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్లలో రైలు ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ క్లాస్ కోచ్‌లు ఉన్నాయని.. అడ్వాన్స్ టికెట్స్ బుక్ చేసుకోవచ్చని వివరించింది.

## ఓయూ పరిధిలో బీఏ వన్‌టైం చాన్స్ పరీక్షా తేదీల ఖరారు

**ఉస్మానియా యూనివర్సిటీ-నవభూమి:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ వన్‌టైం చాన్స్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (ఇయర్ వైస్ స్కీమ్) వన్‌టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ %www.osmania.ac.in%లో చూసుకోవచ్చని సూచించారు.

## తెలంగాణలో 3 రోజులు వర్షాలు

**(1వపేజీ తరువాయి**భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని వివరించింది. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్‌లో తేలికపాటి మోస్తరు వర్షాలు కురిశాయి.

## కూటమికి బిగ్ షాక్

**(1వపేజీ తరువాయి**షాక్ ఇచ్చారు. ఇది ఏఎంఎంకే పార్టీకి ఒక ముఖ్యమైన విజయంగా చెప్పవచ్చు. కానీ ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ,లోక్‌సభ ఎన్నికల్లో ఈ పార్టీ ఆశించిన ఫలితాలను సాధించలేక పోయింది.'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం'పార్టీ ప్రస్తుతం గుర్తింపు పొందని పార్టీగా కొనసాగుతోంది. కూటమిలో ఉన్న పార్టీల నుంచి తమకు సరైన సహకారం లభించడం లేదని, అన్నాడీఎంకే వర్గాలను ఏకం చేసే ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొంటూ దినకరన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో తమ తదుపరి వ్యూహం గురించి డిసెంబర్ నెలలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.ఆ సమావేశం లోనే ఏ కూటమితో కలిసి పనిచేయాలనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటామని దినకరన్ వెల్లడించారు. ఈ పరిణామం తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## 6న ఓయూ పరిధిలో అన్ని పరీక్షలు వాయిదా



**హైదరాబాద్-నవభూమి:** గణేష్ నిమజ్జనం నేపథ్యంలో జంటనగరాల పరిధిలో అన్ని విద్యాసంస్థలకు శనివారం సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఆ రోజు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, బీఈడీ రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేసినట్లు చెప్పారు. తిరిగి పీజీ కోర్సుల పరీక్షలను ఈ నెల 10న, బీఈడీ పరీక్షలను 19వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం, సమయంలలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## ఓయూ పరిధిలో బీ ఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

**హైదరాబాద్-నవభూమి:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షా ఫీజును ఈ నెల 15వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## ఏసీబీకి చిక్కిన నల్లగొండ జిల్లా మత్స్య శాఖ అధికారిణి..



**హైదరాబాద్-నవభూమి:** నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మత్స్య శాఖ అధికారిణిగా పని చేస్తున్న ఎం చరిత రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీలో కొత్త సభ్యుల పేర్ల నమోదుకు అవకాశం కల్పించాలని కోరగా, అందుకు ఆమె లంచం డిమాండ్ చేశారు. ఇవాళ బాధితుడి నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా చరిత రెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

## మద్యం మత్తులో స్కూల్‌కు వచ్చిన టీచర్..




**ఆసిఫాబాద్ -నవభూమి:**విద్యార్థులతో పాటు పది మందికి ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయుడు తప్పటడుగులు వేశాడు. పీకల దాకా మద్యం సేవించి పాఠశాలకు హాజరయ్యాడు. విచారణ చేపట్టిన అధికారులు.. ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.వివరాల్లోకి వెళ్తే.. ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూరు మండల పరిధిలోని సుకుతుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో జే విలాస్ అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే గత కొంతకాలం నుంచి ఉపాధ్యాయుడు మద్యం సేవించి పాఠశాలకు హాజరవుతున్నాడు. అంతేకాకుండా పాఠాలు బోధించకుండా, విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఉపాధ్యాయుడు విలాస్‌పై ఫిర్యాదు చేశారు.

## రాజకీయ కుటుంబ కథాచిత్రం: ఒకరికి పదవి పాయే.. మరొకరికి పార్టీ పాయే!




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూతురు, మాజీ మంత్రి కేటీఆర్ సోదరి అయిన కల్వకుంట్ల కవిత, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెల్లెలు వైఎస్ షర్మిల.. ఈ ఇద్దరు చెల్లెళ్ల వల్ల వారి సోదరుల రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడింది. ఇద్దరి జీవితాల్లోనూ జరిగిన కుటుంబ కలహాలు వారి అన్నదమ్ముల రాజకీయ భవిష్యత్తును పూర్తిగా మార్చేశాయి. : రూ. 51 లక్షలు పలికిన గణేశుడి లడ్డూ తెలంగాణలో కవిత వివాదం మాజీ బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత కుటుంబ కలహం ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఆమె తండ్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా ఆమెను పార్టీ నుండి సస్పెండ్ చేశారు. దీంతో కవిత తన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ వివాదం మొదలవడానికి కారణం కవిత తన కజిన్స్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులైన టి. హరీష్ రావు, జె. సంతోష్ కుమార్లపై చేసిన ఆరోపణలు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ కుంభకోణం జరిగిందని, తన తండ్రి కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయడానికి వీరు కుట్ర పన్నారని కవిత ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంలో కవిత తన సొంత సోదరుడు కూడా తన మాట వినలేదని చెప్పడం ద్వారా కుటుంబంలో నెలకొన్న కలహాలు స్పష్టంగా కనిపించాయి. ఆంధ్రప్రదేశ్‌లో షర్మిల వివాదం: సీఎం పీఠం కోల్పోయిన జగన్ ఇలాంటి ఘటనే కొన్ని సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో కూడా జరిగింది. చెల్లెలి కారణంగా సోదరుడు ముఖ్యమంత్రి పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెల్లెలు వైఎస్ షర్మిల రెడ్డి, ఆస్తి గొడవల కారణంగా తన సోదరుడికి వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టారు. మొదట తెలంగాణలో తన సొంత పార్టీ (వైఎస్ఆర్టీపీ) స్థాపించినా అది పెద్దగా సక్సెస్ కాలేదు. ఆ తర్వాత ఆమె తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. పాకిస్థాన్‌కు సినిమా చూపించిన భారత సైన్యం ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి షర్మిల నాయకత్వం వల్ల పెద్దగా లాభం లేకపోయినప్పటికీ, ఆమె చేసిన ప్రచారాలు జగన్ ప్రతిష్టను బాగా దెబ్బతీశాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల సమయంలో ఆమె తన సోదరుడు జగన్‌పై బహిరంగంగా విమర్శలు చేశారు. దీని ప్రభావం ఎన్నికల ఫలితాలపై స్పష్టంగా కనిపించింది. వైఎస్ఆర్సీపీ ఆంధ్రప్రదేశ్‌లో ఘోర పరాజయం పాలైంది.

జగన్‌కు వ్యతిరేకంగా పోటీ చేసిన టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి భారీ విజయం లభించింది. షర్మిల, జగన్ మధ్య ఆస్తి పంపకాల విషయంలో వివాదం ఉంది. ఇద్దరి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం, జగన్‌కు 60 శాతం, షర్మిలకు 40శాతం వాటా రావాలి. అయితే, షర్మిల ఆరోపించిన దాని ప్రకారం, తన వాటాగా రావాల్సిన రూ.200 కోట్లను జగన్ తనకు ఇవ్వలేదని ఆరోపించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ షేర్ల బదిలీపై తన తల్లి వైఎస్ విజయలక్ష్మి, చెల్లి వైఎస్ షర్మిల మోసగించారని మాజీ సీఎం జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

## మా బంధం దౌత్యానికి మించినది: సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:**భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా, శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోదీ అన్నారు.సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్‌తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు.భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దుతామని వివరించారు.డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐ-పేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో పాటు, ఆసియాన్‌తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షించాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

## ఖైరతాబాద్ గణేషుడి దర్శనానికి వెళ్తున్నారా..? అయితే మీకో అలర్ట్..!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లోని సుప్రసిద్ధ ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకోవడానికి వెళ్లే భక్తులకు అలర్ట్. బడా గణేష్ దర్శనానికి ఈ రోజే చివరి రోజు. దీంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. బుధవారం కూడా భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో క్యూలైన్లలో తోపులాటలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా వీఐపీల రాకపోకల సమయంలో సాధారణ భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధిక రద్దీ మరియు ఎండ కారణంగా దాదాపు 12 మంది భక్తులు సొమ్మసిల్లి పడిపోయిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. నేడు చివరి రోజు కావడంతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. కాబట్టి, పిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు దర్శనానికి వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.ఖైరతాబాద్ గణనాథుడి దర్శనానికి ఈ రోజు అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఉంటుంది. ఇప్పటివరకు దాదాపు 30 లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ గణపతిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత మహా గణపతికి కలశ పూజ నిర్వహించి, దర్శనాలు నిలిపివేస్తారు. సెప్టెంబర్ 6వ తేదీన బడా గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం జరగనుంది. నిమజ్జనం కోసం ప్రత్యేకంగా శంషాబాద్ నుంచి భారీ క్రేన్‌ను తీసుకువస్తున్నారు. ఈ సంవత్సరం శోభాయాత్రలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొననున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. చార్మినార్, ఎంజే మార్కెట్ ప్రాంతాల్లో జరిగే శోభాయాత్రలోనూ అమిత్ షా పాల్గొంటున్నారు. ఈ కారణంగా భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టంగా ఉండనున్నాయి.ఈ నెల 6వ తేదీన జరగనున్న గణేశ్ ఉత్సవాల మహా శోభాయాత్రకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. గణపతి నిమజ్జనం కోసం బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు భారీ ఊరేగింపు సాగనుంది. ఈ యాత్రకు సంబంధించి మత సామరస్యాన్ని దృష్టిలో ఉంచుకుని.. ఈ నెల 6న 'మిలాద్ ఉన్ నబీ' కూడా ఉన్నందున, ఆ రోజు ముస్లిం మతపెద్దలు ఊరేగింపును నిర్వహించకూడదని అంగీకరించారు. వారు తమ ఊరేగింపును 14వ తేదీన నిర్వహించుకుంటారు.

నిమజ్జనం సజావుగా సాగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. మొత్తం 20 ప్రధాన చెరువులు, 72 కృత్రిమ కొలనులను నిమజ్జనం కోసం సిద్ధం చేశారు. ప్రధాన చెరువుల వద్ద 130 స్థిర క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లను అందుబాటులో ఉంచారు. హుస్సేన్ సాగర్ వద్ద భద్రత కోసం 9 బోట్లు, డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు, 200 మంది గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉంటారు. భక్తుల సౌకర్యార్థం 56,187 లైట్లను ఏర్పాటు చేశారు.

# ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంప విలయం

**కాబూల్-నవభూమి:**ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. దేశ తూర్పు ప్రాంతాన్ని కుదిపేసిన ఈ ప్రకృతి విపత్తులో మరణించిన వారి సంఖ్య 2,200 దాటింది. మరో 4,000 మంది ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న కునార్ ప్రావిన్స్‌లో భూకంప తీవ్రత అత్యధికంగా ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, కొండ ప్రాంతాలు కావడంతో సహాయక బృందాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తాలిబాన్ ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఈ భూకంపంలో ఇప్పటివరకు 2,217 మంది ప్రాణాలు కోల్పోయారని, సుమారు 4,000 మంది గాయపడ్డారని డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హందుల్లా ఫిత్రత్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.0గా నమోదైంది.

**మట్టి దిబ్బలుగా మారిన గ్రామాలు**

భూకంప ధాటికి అనేక గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. మట్టి, కలపతో నిర్మించిన ఇళ్లు పేకమేడల్లా కూలిపోవడంతో వందలాది కుటుంబాలు శిథిలాల కింద చిక్కుకుపోయాయి. హెలికాప్టర్లు దిగలేని మారుమూల పర్వత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తాలిబాన్ అధికారులు కమాండోలను గాల్లోంచి దించుతున్నారు. ఇదిలా ఉండగా, గురువారం మరోసారి 4.8 తీవ్రతతో భూమి కంపించడం ప్రజలను మరింత భయాందోళనకు గురిచేసింది. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, మంగళవారం కూడా 5.2 తీవ్రతతో భూకంపం సంభవించింది.

**భారత్ మానవతా సాయం**

ఈ విపత్తుపై స్పందించిన భారత్, ఆఫ్ఘనిస్థాన్‌కు అండగా నిలిచింది. 21 టన్నుల సహాయ సామగ్రితో కూడిన విమానాన్ని కాబూల్‌కు పంపింది. ఇందులో టెంట్లు, దుప్పట్లు, అత్యవసర మందులు, జనరేటర్లు, నీటి ట్యాంకులు ఉన్నాయి. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, అవసరమైన మరింత సహాయం అందిస్తామని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. యూరేషియన్, ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ల సమీపంలో ఉండటం, బలహీనమైన నిర్మాణాల కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌లో తరచూ భూకంపాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి.

## ప్రేమను నిరాకరించాడని యువతి ఆత్మహత్య

**మెదక్-నవభూమి:** జిల్లాలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. ప్రేమ విఫలమైందన్న మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కానిస్టేబుల్ తన ప్రేమను తిరస్కరించడంతో ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంది. మూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచింది.శివ్వంపేట మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన సక్కుబాయి (21) ఒక ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తోంది. ఆమె కొంతకాలంగా సంగారెడ్డిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సిద్దూ అనే యువకుడిని ప్రేమిస్తోంది. అయితే, ఇటీవల సిద్దూ ఆమె ప్రేమను నిరాకరించినట్లు సమాచారం.దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సక్కుబాయి, 3 రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది.

## రూ. 51 లక్షలు పలికిన గణేశుడి లడ్డూ

**(1వపేజీ తరువాయి)**బాలాపూర్‌కు పోటీగా ఇప్పుడు రాయదుర్గం లడ్డూ కూడా నిలిచింది. ఇది భవిష్యత్తులో మరింత ఎక్కువ ధర పలకవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ వేలంపాటల ద్వారా వచ్చే డబ్బును వినాయక ఉత్సవాల నిర్వహణకు, సామాజిక కార్యక్రమాలకు ఉపయోగిస్తారు.

## ముగ్గురు పిల్లల్ని పెట్రోల్ పోసి తగులబెట్టి ..ఆపై తండ్రి ఆత్మహత్య

**(1వపేజీ తరువాయి)**తండా సమీపంలో వెంకటేశ్వర్లు చిన్న కుమార్తె వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) మృతదేహాలు, తాండ్ర సమీపంలో పెద్ద కుమార్తె మోక్షిత (8) మృతదేహం లభ్యమయ్యాయి. చిన్నారులను పెట్రోలు పోసి తగులబెట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

## ఏపీ ప్రజలకు సూపర్ న్యూస్.. ఒక్కో ఫ్యామిలీకి ఏడాదికి 25 లక్షలు

**(1వపేజీ తరువాయి)**ఆయుష్మాన్ భారత్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద యూనివర్సల్ హెల్త్ పాలసీకి ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయంతో 1.63కోట్ల కుటుంబాలకు ఈ ఆరోగ్యబీమా వర్తించనుంది. పేద, మధ్యతరగతి, ధనిక అన్న తేడాలు లేకుండా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఈ హెల్త్ పాలసీని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది.

**2493 నెట్వర్క్ ఆసుపత్రులలో 3257 రకాల ట్రీట్మెంట్లు**

రాష్ట్ర వ్యాప్తంగా 2493 నెట్వర్క్ ఆసుపత్రులలో ఎన్టీఆర్ వైద్య సేవ హైబ్రిడ్ విధానాన్ని చంద్రబాబు సర్కార్ అమలు చేయనుంది. మొత్తం 3257 రకాల ట్రీట్మెంట్ లను ఈ హైబ్రిడ్ పద్ధతిలో ఉచితంగా ప్రజలకు అందిస్తారు. అంతేకాదు ట్రీట్మెంట్ కోసం వచ్చేవారికి త్వరితగతిన అప్రూవల్ ఇవ్వడానికి కూడా తగిన చర్యలు చేపడతారు. అప్లై చేసుకున్న ఆరు గంటల్లోనే ట్రీట్మెంట్ కు అనుమతులు ఇచ్చేలా ప్రీ ఆథరైజేషన్ చర్యలు చేపట్టారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఇన్ని కుటుంబాలకు లబ్ది**

రెండున్నర లక్షల లోపు ఉన్న వైద్య చికిత్సలకు క్లెయిమ్ లు వచ్చేలా సరికొత్త విధానాన్ని రూపొందించారు. రెండున్నర నుండి 25 లక్షల వరకు అయ్యే వైద్య ఖర్చులను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ చెల్లించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.43 కోట్ల పేద కుటుంబాలతో పాటు, 20 లక్షల మంది మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు చెందిన కుటుంబాలకు ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీతో లబ్ధి చేకూరనుంది.

**కొత్తగా 10 మెడికల్ కళాశాలలు**

ఇదిలా ఉంటే నేడు క్యాబినెట్ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. పిపిపి విధానంతో కొత్తగా పది మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ పది కాలేజీలను ఒకే దశలో కాకుండా రెండు దశలలో నిర్మించనున్నారు. పాలకొల్లు, బాపట్ల, అమలాపురం, నర్సీపట్నం, పార్వతీపురం, పెనుగొండ, మదనపల్లె, ఆదోని, పులివెందుల, మార్కాపురంలలో కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నారు.

## సుప్రీంకోర్టులో పిన్నెల్లి సోదరులకు ఊరట



**(1వపేజీ తరువాయి)**పల్నాడు జిల్లా:పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి దేశ అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. ఈ కేసులో వారిని అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తమకు ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది.

అంతకుముందు, ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పిన్నెల్లి సోదరులు హైకోర్టును ఆశ్రయించగా, వారి పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు నిర్ణయంతో తమకు అరెస్ట్ ముప్పు పొంచి ఉందని భావించిన వారు, సుప్రీంకోర్టు తలుపు తట్టారు. వారి వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు వారిని అరెస్ట్ చేయవద్దని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు హత్యకు గురైన ఘటనలో పిన్నెల్లి సోదరులపై మే 25న పోలీసులు కేసు నమోదు చేశారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 302 (హత్య) కింద నమోదు చేసిన ఈ కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఏ6గా, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిని ఏ7గా చేర్చారు. ఈ కేసులో మొత్తం ఏడుగురిని నిందితులుగా పేర్కొన్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఉత్తర్వులతో పిన్నెల్లి సోదరులకు తాత్కాలికంగా అరెస్ట్ నుంచి ఉపశమనం లభించినట్లయింది.

## కామారెడ్డిలో ఏరియల్ సర్వే చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**(1వపేజీ తరువాయి)**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఆయన వెంట టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఉన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేయడంతో పాటు బాధితులతో ఆయన మాట్లాడారు.వరద నష్టంపై కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వరదల కారణంగా ఎంత నష్టం జరిగింది, ఎన్ని నిధులు అవసరమో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులు, నిర్మాణాలు తాత్కాలికంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు.ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే వరద నష్టాలను తగ్గించగలమని ముఖ్యమంత్రి అన్నారు. ఎవరికి వారు ఉంటామంటే క్రైసిస్ మేనేజ్‌మెంట్ చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో సమన్వయం లోపం వల్లే సమస్యలు వస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.యూరియా పంపిణీలో ముందుగా రైతులకు టోకెన్లు ఇచ్చి గందరగోళం లేకుండా చూడాలని సూచించారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమస్యలపై 15 రోజుల తర్వాత మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్
శుక్రవారం
05 । సెప్టెంబర్ । 2025

# ఆర్ఎస్ఎస్ చీఫ్‌తో.. వసుంధర రాజే రహస్య సమావేశం





**జైపూర్-నవభూమి:** రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్‌తో రహస్యంగా సమావేశమయ్యారు. ఈ ప్రత్యేక భేటీ సుమారు 20 నిమిషాలు కొనసాగింది. జోధ్‌పూర్‌లో రెండు రోజుల పర్యటనలో ఉన్న బీజేపీ సీనియర్ నాయకురాలు వసుంధర రాజే, గురువారం రామ్‌డియోరా మందిరానికి వెళుతూ లాల్ సాగర్ ప్రాంతంలోని ఆదర్శ్ విద్యా మందిర్‌లో మోహన్ భగవత్‌ను కలిశారు. వారిద్దరి ప్రత్యేక సమావేశం సుమారు 20 నిమిషాలు కొనసాగింది. ఆమె సన్నిహితులు, పార్టీ నేతలు ఎవరూ కూడా సమావేశ గదిలో లేరు.కాగా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో వసుంధర రాజే ఏం చర్చించారు, ఏం మాట్లాడారు అన్నది తెలియలేదు. అయితే కొంత కాలంగా బీజేపీ కార్యకలాపాలకు ఆమె దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా మోహన్ భగవత్‌ను ప్రత్యేకంగా కలుసుకోవడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.అనంతరం జోధ్‌పూర్‌లోని రెండు పుణ్యక్షేత్రాలైన సురాసాగర్‌లోని బడా రామద్వారా, రైకా బాగ్‌లోని జుగల్‌జోడి ఆలయాన్ని వసుంధర రాజే సందర్శించారు. సేనాచార్య అచలానంద గిరి మహారాజ్‌ను ఆమె కలిశారు. అలాగే పోఖ్రాన్ సమీపంలోని రామ్‌డియోరా మందిరాన్ని కూడా వసుంధర రాజే సందర్శించారు.

## రన్‌వేపై విమానాన్ని ఢీ కొట్టిన పక్షి.. విజయవాడ-బెంగళూరు ఫ్లైట్ రద్దు



**బెంగళూరు-నవభూమి:** విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం రద్దైంది. గురువారం ఉదయం ఫ్లైట్ విజయవాడ రన్‌వే )పై ఉండగా నోస్ భాగాన్ని పక్షి ఢీ కొట్టింది . దీంతో ముందు జాగ్రత్త చర్యగా అధికారులు ఫ్లైట్‌ను రద్దు చేశారు. టేకాఫ్ కోసం రన్‌వేపై వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. టేకాఫ్‌కు ముందే పక్షి ఢీ కొట్టినట్లు అధికారులు తెలిపారు. ఘటన తర్వాత విమానయాన సంస్థ విమానాన్ని రద్దు చేసింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## ట్రాఫిక్‌తో విసుగెత్తి.. బైక్‌ను భుజంపై వేసుకొని..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఎడతెరిపి లేని వర్షాల కారణంగా దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీ-ఎన్సీఆర్‌లో ఇటీవలే భారీ ట్రాఫిక్ జామ్ అయిన విషయం తెలిసిందే. రెండు గంటల పాటూ నిరంతరాయంగా కురిసిన వర్షానికి ఢిల్లీ-గురుగ్రామ్ జాతీయ రహదారిపై 20 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి వాహనదారులు రోడ్డుపై ఎటూ కదల్లేక నరకయాతన అనుభవించారు.ట్రాఫిక్‌కు విసిగిపోయిన ఓ వ్యక్తి ఎవరూ ఊహించని నిర్ణయం తీసుకున్నాడు. ఓ వ్యక్తి సాయంతో తన బైక్‌ను ఏకంగా భుజంపై వేసుకుని నడుచుకుంటూ వెళ్లారు అతడి చర్యతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా షాక్‌తో అలా చూస్తూ ఉండిపోయారు. కొందరు ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'గురుగ్రామ్ ట్రాఫిక్‌కు ఒకే ఒక పరిష్కారం..' అంటూ వీడియోకి క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ దృశ్యాలు వైరల్‌గా మారాయి. ఈ వీడియో చూసిన నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

## ప్రభుత్వానికి ఎనిమిదేళ్లు పట్టింది.. టూ లేట్.. జీఎస్టీ తగ్గింపుపై చిదంబరం

**న్యూఢిల్లీ-నవభూమి:**కొత్త వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడున్న 5, 12, 18, 28 శాతం స్లాబుల్లో 12, 28 శాతం స్లాబులను తీసేశారు. ఈ నెల 22 నుంచి మారిన స్లాబుల ప్రకారం ఆయా వస్తూత్పత్తులపై నూతన పన్ను రేట్లు వర్తించనున్నాయని బుధవారం ఇక్కడ జీఎస్టీ కౌన్సిల్ భేటీ అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ నిర్ణయంపై కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎంపీ పి. చిదంబరం తాజాగా స్పందించారు. జీఎస్టీ హేతుబద్ధీకరణ, రేట్లు తగ్గించడాన్ని స్వాగతించారు.ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి ఎనిమిదేళ్లు ఎందుకు పట్టిందంటూ విమర్శలు గుప్పించారు. ఇంతకాలం తర్వాత ప్రభుత్వం హఠాత్తుగా ఈ మార్పులు చేయడానికి గల కారణాలపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మందగించిన ఆర్థిక వృద్ధి, పెరుగుతున్న కుటుంబ అప్పులు, పడిపోతున్న పొదుపు, త్వరలో జరగనున్న బీహార్ ఎన్నికలు లేదా అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి.. జీఎస్టీ రేట్ల తగ్గింపుకు వీటన్నింటిలో ఏదో ఒక కారణమా..? అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో వరుస పోస్టులు పెట్టారు. అయితే, తాజా నిర్ణయంతో పేద, మధ్యతరగతి వర్గాలకు కొంత ఉపశమనం లభిస్తుందని చిదంబరం అభిప్రాయపడ్డారు.



## డేంజర్ మార్క్‌ను దాటి ప్రవహిస్తున్న యమునా నది.. నీట మునిగిన రిలీఫ్ క్యాంప్స్



**న్యూఢిల్లీ-నవభూమి:** గతకొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీ-ఎన్సీఆర్ అతలాకుతలమవుతున్నది. కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించిపో యింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా యమునా నది ఉప్పొంగింది. డేంజ్‌మార్క్‌ను దాటి ప్రవహిస్తోంది. దీంతో ఢిల్లీని వరద ముంచెత్తింది. నిరాశ్రయుల కోసం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలు కూడా నీటమునిగాయి అధికారిక సమాచారం ప్రకారం.. ఢిల్లీలోని ఓల్డ్ రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నది నీటి మట్టం గురువారం ఉదయం 7 గంటలకు 207.48 మీటర్లుగా ఉంది. అదే ఉదయం 5 గంటల సమయంలో 207.47 మీటర్లుగా ఉంది. తెల్లవారుజామున 2 గంటల నుంచి 5 గంటల మధ్య నదిలో నీటి మట్టం 207.47 మీటర్ల వద్ద స్థిరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. 5 గంటల తర్వాత వరద ప్రవాహం పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## సమోసాలు తేలేదని.. భర్తను చచ్చేలా కొట్టిన భార్య

**పిలిభిత్-నవభూమి:** సమోసాలు తేలేదన్న కోపంతో ఓ మహిళ తన భర్తను చితకబాదిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్‌లో చోటుచేసుకున్నది. పిలిభిత్ జిల్లాలోని ఆనంద్‌పూర్‌కు చెందిన శివమ్ అనే వ్యక్తికి తన భార్య సంగీత సమోసాలు తీసుకురమ్మని ఆగస్టు 30న చెప్పింది. అయితే అతడు తేలేకపోయాడు. మరుసటి అతనిపై తన తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు గ్రామ పెద్ద అవ్‌దేశ్ శర్మ వద్ద పంచాయితీ పెట్టారు.పంచాయితీకి శివమ్‌తోపాటు అతని తల్లి, మరికొందరు కుటుంబీకులు హాజరవగా, సంగీత తన తల్లిదండ్రులతోపాటు మేనమామ, మరికొందరితో కలిసి అక్కడికి వచ్చింది. ఈ క్రమంలో ఇరు పక్షాల మధ్య మాటామాట పెరగడంతో.. సంగీత తల్లిదండ్రులు, బంధువులు.. శివమ్‌ను చచ్చేలా కొట్టారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన అతని బంధువులపై కూడా దాడి చేశారు. దీంతో స్థానికులు కలుగజేసుకుని.. గాయపడిన వారిని దవాఖానకు తరలించారు.

# ఆందుకేనేమో ఈ పరిస్థితి.. ఆకస్మిక వరదలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:**గత కొద్ది రోజులుగా దేశాన్ని వణికిస్తోన్న ప్రకృతి వైపరీత్యాలు ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో క్లౌడ్ బరస్ట్‌లు , మెరుపు వరదలపై సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిల్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. కీలక వ్యాఖ్యలు చేసింది. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని వ్యాఖ్యానించింది. ఈ విపత్తులకు కొండ ప్రాంతాల్లో చెట్లను అక్రమంగా నరికివేయడమే కారణమని పేర్కొంది. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలతో కూడిన సమాధానం ఇవ్వాలని సంబంధిత మంత్రిత్వ శాఖలు, వివిధ రాష్ట్రాలకు నోటీసులు జారీచేసింది. అనంతరం విచారణను రెండు వారాలు వాయిదా వేసింది.

"ఉత్తరాది రాష్ట్రాల్లో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలకు కొండ ప్రాంతాల్లో చెట్లను అక్రమంగా నరికివేయడమే అనడానికి మీడియాలో వస్తున్న నివేదికలు ప్రాథమికంగా స్పష్టమైన ఆధారాలు.. వరదల్లో భారీ ఎత్తున కలప, దుంగలు కొట్టుకురావడం నివేదికల్లో గమనించాం" అని ధర్మాసనం పేర్కొంది. హిమాచల్ రాష్ట్రంలోని హిమ్రీ ప్రాంతంలో అక్రమంగా చెట్లు నరికివేత , అనధికార రహదారి నిర్మాణం, అక్రమ మైనింగ్, కలప వంటి పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని సామాజిక కార్యకర్త విజయేంద్ర పాల్ సింగ్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిల్‌లో ఆరోపించారు. ఈ పిల్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆకస్మిక వరదలకు చెట్లు నరికివేత కూడా కారణం కావచ్చని అభిప్రాయపడింది. ఇదిలా ఉండగా.. ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో మెరుపు వరదలకు పుష్ప సినిమాలోని సీన్‌ను తలపించేలా ఓ నదిలో దుంగలు తెలియాడుతున్న వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. దీంతో హిమాచల్‌లో టింబర్ మాఫియాలు రెచ్చిపోతున్నాయని, ఇది 'రియల్ పుష్ప సీన్' అంటూ నెటిజన్లు కామెంట్లు చేశారు. పిల్ విచారణ సమయంలో సీజేఐ ధర్మాసనం ఈ వీడియోనే ప్రస్తావించినట్టు అర్థమవుతోంది. .ఉత్తరాదిలోని పలు రాష్ట్రాలు ఆకస్మిక వరదలతో అల్లాడుతున్నాయి. పంజాబ్‌లోని మొత్తం 23 జిల్లాలు వరద ముంపునకు గురయ్యాయి. ఆ రాష్ట్రంలో 37 ఏళ్ల తర్వాత ఇటువంటి పరిస్థితి నెలకుంది. ఏకంగా 1,200 గ్రామాలను వరద ముంచెత్తింది. ఇప్పటి వరకూ 37 మంది ప్రాణాలు కోల్పోగా.. వందల మంది గాయపడ్డారు. అనేక జిల్లాల్లోని ప్రజలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఏకంగా, 1.70 లక్షల హెక్టార్లలో పంట నీటి మునిగింది. పంజాబ్ రైతాంగాన్ని ఆకస్మిక వరదలు కోలుకోలేని దెబ్బతీశాయి.

# వామ్మో ఇంత రెంటా.. సింగిల్ బెడ్రూం అపార్ట్‌మెంట్ అద్దె నెలకు రూ.1.20 లక్షలంట..




**న్యూఢిల్లీ-నవభూమి:**సాధారణంగా సింగిల్ బెడ్రూం రూమ్ రెంట్ అంటే ఎంత ఉంటుంది.. మన హైదరాబాద్‌లో అయితే ఏరియాను బట్టి చూసుకున్నా.. 6 వేల నుంచి 20 వేల రూపాయల వరకు ఉండవచ్చు. విత్ ఫర్నిచర్ అయితే రెంట్ మరి కాస్త ఎక్కువ ఉంటుంది. సరే కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఎక్కువగానే ఉంటుంది అనుకుందాం. ఎంత ఎక్కువ అయినా సరే.. మన దగ్గర సింగిల్ బెడ్రూం ఫ్లాట్ రెంట్ మాత్రం లక్ష రూపాయల పైన అస్సలు ఉండదు. అంత మొత్తం పెట్టి రెంట్‌కు ఉండే బదులు.. అదే మొత్తాన్ని ఈఎంఐ కట్టుకుంటే.. సొంత ఫ్లాట్ వస్తుందని భావిస్తారు. సింగల్ బెడ్రూం ఫ్లాట్‌కు నెలకు రూ.1.20 లక్షల రెంట్ అంటే నమ్మశక్యంగా లేకపోయినా.. ఇది మాత్రం వాస్తవం అంటున్నారు ఓ రష్యన్ మహిళ. తాను సింగిల్ బెడ్రూం అపార్ట్‌మెంట్‌కి నెలకు రూ.1.20 లక్షల రెంట్ కడుతున్నట్లు తెలిపి అందరిని ఆశ్చర్యపరిచారు. ఆ వివరాలు..

గుర్‌గ్రామ్‌లో ఒక రష్యన్ మహిళ తన నెలవారీ ఖర్చుల గురించి చెబుతూ పోస్ట్ చేసిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. విక్టోరియా కోవన్ అనే రష్యన్ మహిళ తాను సింగిల్ బెడ్రూం అపార్ట్‌మెంట్‌కు నెలకు రూ. 1,20,000 అద్దె చెల్లిస్తున్నానని చెప్పి అందరిని షాక్‌కు గురి చేసింది. ఆమె చెప్పిన అద్దె చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు. సాధారణంగా గుర్‌గ్రామ్‌లో ఇలాంటి ఫ్లాట్‌లు రూ. 8,000 నుంచి రూ. 23,000 మధ్యలో దొరుకుతా యంటున్నారు ఈ వీడియో చూసిన నెటిజనులు. గుర్‌గ్రామ్‌లో మంచి జీవితం గడపాలంటే మీ జేబుల నిండ డబ్బులుండాలి అనే క్యాప్షన్‌తో ఆమె పోస్ట్ చేసిన వీడియోలో తన నెలవారీ ఖర్చుల గురించి ఇలా చెప్పుకొచ్చారు.

ఉబర్ బ్లాక్ ఒక్కో రైడ్‌కు రూ. 1,000
కరెంటు బిల్లు: రూ. 15,000
షాపింగ్: రూ. 30,000
మందులు: రూ. 20,000
సరుకులు: రూ. 40,000

వీడియో వైరల్ కావడంతో చాలా మంది ఆమె చెప్పిన రెంట్ చాలా ఎక్కువని.. అంత భారీ రెంట్లు లేవని కామెంట్ చేశారు. దీంతో సదరు మహిళ స్పందిస్తూ.. తాను ఫిర్యాదు చేయడం లేదని.. కేవలం గురుగ్రామ్‌లో మంచి జీవితం గడపాలంటే.. జేబు నిండా డబ్బులుండాలని చెప్పడమే తన ఉద్దేశం అని చెప్పుకొచ్చారు. ఇక వీడియో చూసిన నెటిజనులు ఆమె చాలా వరకు ఖర్చులు తగ్గించుకోవచ్చని సలహా ఇస్తున్నారు. ఉబర్ బ్లాక్ బదులుగా సాధారణ ఉబర్ వాడుకోవచ్చు.. ఇంత రెంట్ చెల్లించే ఇంట్లో బదులు తక్కువ అద్దె ఉన్న అపార్ట్‌మెంట్‌కు మారవచ్చు.. అలానే షాపింగ్ ఖర్చులు కూడా తగ్గించుకోమని సలహా ఇస్తున్నారు.మరొక యూజర్ రూ. 1,20,000 అద్దెనా.. అంత పెద్ద ఏరియాలో 4బీహెచ్‌కే ఫ్లాట్‌లో ఉంటే ఓకే. కానీ, అలా కాకపోతే మిమ్మల్ని ఎవరూ మోసం చేస్తున్నారు అని కామెంట్ చేశారు. మరో యూజర్ స్పందిస్తూ.. నెలకు రూ. 1,20,000 అద్దె కట్టే బదులు %జువీ×% కట్టి అపార్ట్‌మెంట్ కొనుక్కోవచ్చు సలహా ఇచ్చాడు. అంటే, అంత అద్దె కట్టే బదులు సొంత ఇల్లు కొనుక్కోవడం మంచిదని అతని ఉద్దేశం. ఈ వీడియో సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. గుర్‌గ్రామ్‌లో జీవన వ్యయం గురించి చాలామంది తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## జైల్లో వివాహం.. అత్యాచార బాధితురాలిని పెళ్లి చేసుకున్న ఖైదీ..



**మధుబని-నవభూమి:** బీహార్ రాష్ట్రంలోని మధుబని జిల్లా జైలు వివాహ వేదికగా మారింది. జైల్లో ఉన్న ఓ ఖైదీ.. అత్యా చార బాధితురాలిని వివాహం చేసుకున్నాడు. జైలు సిబ్బంది వీరి పెళ్లికి పెద్దలుగా వ్యవహ రించగా.. తోటి ఖైదీలు.. బంధుమిత్రులుగా మారారు. జైల్లో ఉన్న వ్యక్తి అత్యాచార బాధిత రాలిని చేసుకున్నాడంటే అతడిలో ఏ స్థాయిలో మార్పు వచ్చిందో అని సంబరపడకండి. ఎందుకంటే ఆ ఖైదీ వివాహం చేసుకుంది.. స్వయంగా అతడి మీద అత్యాచార ఆరోపణలు చేసిన మహిళనే. మరో వింత ఏంటంటే.. ఆమె అతడికి స్వయానా వదిన అవుతుంది. ఈ వింత పెళ్లి వివరాలు మరింత ఆశ్చర్యపరుస్తాయి. జైలు అధికారులు దగ్గరుండి మరీ ఈ పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేశారు. సిబ్బంది ఈ పెళ్లికి సాక్షులుగా ఉన్నారు. మిగతా ఖైదీలు బంధు, మిత్రుల పాత్ర పోషించారుఈక్రమంలో నిందితుడి తరఫు న్యాయవాది గగన్ దేవ్ యాదవ్ మాట్లాడుతూ.. ఆసక్తికర అంశాలు వెల్లడించారు. నిందితుడి అన్న 2022లో మరణించాడు. ఆ తర్వాత నిందితుడి అన్న భార్య.. అనగా అతడి వదిన నిందితుడితో కలిసి ఉండటం మొదలు పెట్టింది. ఇద్దరూ కలిసి జీవించడం ప్రారంభించారు. అయితే కొంత కాలం తర్వాత నిందితుడు, అతడి వదిన మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో ఆమె 2024 జూన్ 29న.. నిందితుడి మీద పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు మహిళా పోలీస్ స్టేషన్లో నమోదయింది. మహిళ ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపారు.ఆ తరువాత అతను బెయిల్ కోసం పాట్నా హైకోర్టుకు వెళ్ళాడు. అయితే కోర్టు ఒక విచిత్రమైన కండిషన్ పెట్టింది. పెళ్లి చేసుకున్న తర్వాత, ఆ విషయాన్ని దిగువ కోర్టు ధృవీకరించాలని ఆదేశించింది. దీంతో నిందితుడు పెళ్లి చేసుకోవడానికి అనుమతి కోరుతూ కోర్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. కోర్టు అందుకు ఆమోదం తెలపడంతో.. జైలులోనే వారి పెళ్లి జరిగింది. ఇది చాలా అరుదైన సంఘటన అని చెప్పవచ్చు. అయితే కోర్టు ఆదేశాల ప్రకారమే జైలు ఆవరణలో పెళ్లి జరిపించాము అని జైలు సూపరింటెండెంట్ తెలిపారు. అంతేకాక పెళ్లికి కావాల్సిన ఏర్పాట్లన్నీ తామే చేశామని తెలిపారు.ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అనగా మంగళవారం జైల్లోనే అధికారులు ఖైదీ వివాహానికి ఏర్పాట్లు చేశారు. జైలు సిబ్బంది.. తోటి ఖైదీల మధ్య వివాహం జరిపించారు. కోర్టు నుంచి ఆదేశాలు రావడంతో.. ఆ మేరకు జైలు యంత్రాంగం ఈ వేడుకకు ఏర్పాట్లు చేసిందని అధికారులు తెలిపారు. బంధువులకు బదులుగా జైలు సిబ్బంది, తోటి ఖైదీలు సాక్షుల పాత్ర పోషించారని పేర్కొన్నారు. కోర్టు ఆదేశానుసారం వివాహం జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు జైలు సూపరింటెండెంట్ ఓం ప్రకాష్ శాంతి భూషణ్ తెలిపారు.

# పంజాబ్‌లో వరదలు బీభత్సం..

### నీట మునిగిన 1,200 గ్రామాలు.. 37 మంది మృతి



**పంజాబ్-నవభూమి:**పంజాబ్‌ను మరోసారి భారీ వర్షాలు ముంచెత్తాయి. ఆ రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాలు వరదలకు ప్రభావితమయ్యాయి. ఈ వరదల్లో ఇప్పటి వరకూ 37 మంది మృతిచెందారు. పంజాబ్‌లో ఈ స్థాయిలో వరదలు సంభవించడం 1988 తర్వాత ఇదే మొదటిసారి. ఎగువన హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్‌లో కురుస్తోన్న భారీ వర్షాలకు సట్లెజ్, బియాస్, రావి నదులు ప్రమాదకరస్థాయి దాటి ప్రవహిస్తూ.. ఊళ్లకు ఊళ్లను ముంచేశాయి. దీనికి తోడు ఆ రాష్ట్రంలో కురుస్తోన్న భారీ వర్షాలతో మొత్తం 1,200 గ్రామాలు నీటమునిగాయి. గురుదాస్‌పూర్, పఠాన్‌కోట్, ఫాజిల్కా, కపుర్తాల, తరాన్ తరాన్, ఫిరోజ్‌పూర్, హోషియార్‌పూర్, అమృత్‌సర్ జిల్లాల్లో గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి.

భారీ వర్షాలు, వరదలు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు సెప్టెంబరు 7 వరకు సెలవులు ప్రకటించింది. తరాన్ తరాన్ జిల్లాలోని వరద ప్రభావిత గ్రామాల్లో పంజాబ్ మంత్రులు, ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాలు పర్యటించారు. ఈ క్రమంలో ఆప్ నేతలు నదీ తీరాల్లోని కట్టల పరిస్థితిని సమీక్షించారు. పెరుగుతున్న నదీ జలాల వల్ల ఎదురయ్యే తక్షణ సవాళ్లను అంచనా వేయడానికి స్థానికులతో మాట్లాడారు.కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నారు. అమృత్‌సర్, గురుదాస్‌పూర్, కపుర్తల జిల్లాల్లోని గ్రామాలను సందర్శించి, బాధితులను కలుసుకుంటారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అలాగే, పంట నష్టంపై అధికారులతో సమీక్షించి, బాధితులను ఆదుకోడానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించనున్నారు. ఆకస్మిక వరదలతో 1.48 లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్టు అదికారులు తెలిపారు.మరోవైపు ప్రభావిత ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న బాధితులకు ఆహారం అందజేత, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటిసహాయక కార్యక్రమాలకు సైన్యం రంగంలోకి దిగింది. స్వచ్ఛంద సంస్థలు, సిక్కు సంఘాలు కూడా వరద బాధితులను ఆదుకోడానికి ముందుకొచ్చాయి. వారికి నిత్యావసరాలు, ఔషధాలు, బిస్కెట్లు, పశువులకు దాణాను అందజేస్తున్నారు. అధికార యంత్రాంగం సైతం వరద బాధితుల కోసం సహాయక శిబిరాలను ఏర్పాటుచేస్తోంది. వందలాది గ్రామాల్లోని పశువుల పాకలు, గోశాలలు నీటమునిగాయి. గ్రామాల్లోకి వరద పోటెత్తడంతో ఇళ్లపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకుంటున్నారు.

## ఢిల్లీకి పొంచి ఉన్న ముప్పు.. 63 ఏళ్ల తర్వాత మళ్లీ



**న్యూఢిల్లీ-నవభూమి:**ఈసారి రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశవ్యాప్తంగా కుండపోత వానలు కురుస్తున్నాయి. ఇక ఢిల్లీ , గురుగావ్ వంటి ప్రాంతాలు అయితే పూర్తిగా నీట మునిగిపోయాయి. రెండు రోజుల క్రితం గురుగావ్‌లో 20 కిమీ మేర ట్రాఫిక్ నిలిచిపోయిందంటే.. వర్ష బీభత్సం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక దేశ రాజధాని ఢిల్లీలో కుండపోత వాన కురుస్తోంది. భారీ వర్షాలు, వరదల వల్ల రోడ్లన్ని జలమయం అయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. ఇక బుధవారం ఢిల్లీ వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు సఫ్దర్‌జంగ్, కశ్మీర్‌గేట్, ఇండియాగేట్, కన్నాట్ ప్లేస్ సహా అనేక ప్రాంతాలు నీట మునిగి.. నగరం పూర్తిగా స్తంభించిపోయింది.ఇదిలా ఉంటే ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల రాజధానికి ఆనుకుని ఉన్న యమునా నదిలో రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. సుమారు 63 ఏళ్ల తర్వాత ఈ స్థాయిలో వరద నీరు వచ్చి చేరిందని అధికారులు తెలిపారు. హత్నికుండ్ బ్యారేజ్ నుంచి భారీగా నీటిని వదలడంతో.. యమునలో నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోంది. బుధవారం అనగా సెప్టెంబర్ 3 రాత్రి పది గంటల ప్రాంతంలో యమునలో నీటిమట్టం 207.43 మీటర్లకు పెరిగింది. 63 సంవత్సరాల తర్వాత అంటే 1963 తర్వాత యమునా నదిలో నీటి మట్టం ఈ స్థాయికి చేరడం ఇది మూడో సారి అంటున్నారు.భారీ వర్షాలు, వరదల వల్ల దేశ రాజధాని నగరం ఢిల్లీలోని రింగ్ రోడ్డు, సివిల్ లైన్స్ సహా అనేక ప్రాంతాలు నీట మునిగిపోయాయి. ఈ వర్షాల వల్ల ఢిల్లీ వ్యాప్తంగా సుమారు 12 వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని అధికారులు తెలిపారు. వరదల వల్ల మజ్ను కాటిల్లా, సలీంగర్ బైపాస్ మార్గాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడి జనాలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం కురుస్తోన్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని.. గీతా కాలనీ, నిగంబోధ్ ఘాట్ ప్రాంతాల్లో దహన సంస్కారాలను నిలిపివేశారు.వరద పరిస్థితులను పర్యవేక్షిస్తున్న నోడల్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదల ముప్పు నుంచి సుమారు 12 వేల మందిని మందిని కాపాడమని తెలిపారు. అలానే వర్షం వల్ల నిరాశ్రయులైన బాధితుల కోసం 38 సహాయక శిబిరాలను ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే ఎగువన యమునా నది పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. హత్నికుండ్ బ్యారేజ్ నుంచి బుధవారం రాత్రి 7 గంటలకు 1.78 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాధారణంగా ఈ బ్యారేజ్ నుండి 50 వేల క్యూసెక్కుల కంటే తక్కువ నీరు మాత్రమే విడుదల అవుతుంటుంది. కానీ ఈసారి అది రెండింతలు పెరిగింది. ఇలానే భారీ వర్షాలు కొనసాగితే ఢిల్లీకి ముప్పు తప్పదని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

## దూకాలని సవాల్ చేసిన భర్త.. మేడ పైనుంచి కిందకు దూకిన భార్య



**లక్నో-నవభూమి:** ఒక మహిళ మేడ పైకి ఎక్కింది. అయితే అక్కడి నుంచి దూకాలని ఆమె భర్త సవాల్ చేశాడు. దీంతో ఆ మహిళ మేడ పైనుంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమె ఆసుపత్రిపాలయ్యింది. ఈ నేపథ్యంలో అదనపు కట్నం వేధింపులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గోండా ప్రాంతంలోని డకౌలి గ్రామంలో అత్తవారింట్లో నివసించే అర్చనకు ఆరేళ్ల కిందట సోనుతో వివాహం జరిగింది. ఆ దంపతులకు నాలుగు, రెండేళ్ల వయస్సున్న ఇద్దరు పిల్లలున్నారు.కాగా, అత్తింటి వారు అదనపు కట్నం కోసం అర్చనను వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 1న భర్తతో ఆమెకు గొడవ జరిగింది. మనస్తాపం చెందిన అర్చన రెండు అంతస్తుల మేడ పైకి ఎక్కింది. అయితే అక్కడి నుంచి కిందకు దూకాలని భర్త సోను పలుమార్లు అన్నాడు. దీంతో అర్చన మేడ పైనుంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమెను భర్త కొట్టాడు. అనంతరం అర్చనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న అర్చన సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెళ్లి సమయంలో సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపాడు. అయితే అత్తమామలు రూ.5 లక్షలు అదనపు కట్నం, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ డిమాండ్ చేస్తున్నారని, అర్చనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సోను సోదరుడు ప్రమోద్ అర్చనను లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపించాడు.కాగా, ఆసుప్రతిలో చికిత్స పొందుతున్న అర్చన స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు. దీని ఆధారంగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలపారు. పొరుగింటి వ్యక్తి మొబైల్‌లో రికార్డ్ చేసిన వీడియో క్లిప్‌ను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఢిల్లీలో రోడ్లన్నీ జలమయం

**న్యూఢిల్లీ-నవభూమి:** గతకొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఢిల్లీ-ఎన్‌సీఆర్ (దేశ రాజధాని ప్రాంతం) అతలాకుతలమవుతున్నది. బుధవారం కురిసిన భారీ వర్షాలకు సఫ్దర్‌జంగ్, కశ్మీర్‌గేట్, కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్ సహా పలు ప్రాంతాలు నీటమునిగాయి. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. గురుగ్రామ్‌కు వెళ్లే రోడ్లన్నీ నీట మునగటంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీ సహా, పొరుగున ఉన్న నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్‌లలో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. యమునా బజార్‌లోని పునరావాస క్యాంప్‌లోకి వరదనీరు పెద్ద ఎత్తున చేరడంతో, బాధితులను మరో చోటకు తరలించారు.



భారీ వర్షాల తాకిడితో ఢిల్లీ విమానాశ్రయంలో వందలాది విమానాలపై ప్రభావం పడింది. దాదాపు 340కిపైగా విమాన రాకపోకలు ఆలస్యమయ్యాయి. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో, వేలాది వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి.

## రోహిత్ వేముల చట్టం అవసరం

భారతదేశంలో ఉన్నత విద్యా వ్యవస్థకు ఒక కొత్త మలుపు తిప్పిన సంఘటనగా రోహిత్ వేముల విషాద మరణాన్ని గుర్తించక తప్పదు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్న రోహిత్, కుల వివక్ష అనే లోతైన సామాజిక సమస్యతో తాకి మానసిక ఒత్తిడికి గురై ప్రాణత్యాగం చేశాడు. ఆయన మరణం కేవలం ఒక విద్యార్థి జీవితానికి ముగింపు మాత్రమే కాదు, అది దేశంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో దాగి ఉన్న అనేక సమస్యలను వెలికితీసిన ఘోర మేల్కొలుపు. కుల వివక్ష అనే దృశ్యమరుపు పీడన ఎంత లోతుగా విద్యా ప్రాంగణాలను ఆక్రమించుకుందో రోహిత్ కేసు దేశమంతటికి అద్దం పట్టింది. ఈ నేపథ్యంలోని రోహిత్ వేముల చట్టం ప్రతిపాదన, కేవలం శిక్షాపరమైన చర్యలకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యా వాతావరణాన్ని మౌలికంగా మార్చే సమగ్ర ప్రణాళికగా రూపుదిద్దుకోవాలి. ఉన్నత విద్యలో కుల వివక్ష అనేది బహిరంగ హింసల రూపంలో మాత్రమే కాకుండా సూక్ష్మ వివక్షల రూపంలో కూడా ప్రతిఫలిస్తుంది. తరగతి గదిలో అధ్యాపకులు ఇచ్చే చిన్నచిన్న వ్యాఖ్యలు, సహ విద్యార్థుల వ్యంగ్య పలుకులు, ర్యాంకులు మరియు కులంతో ముడిపెట్టిన చర్చలు, హాస్టల్ వాతావరణంలో జరిగే సామాజిక వర్గీకరణ%ఖశ్రీశ్రీ ౯ప్రవంవ ఎతీమ్ఘవ ఖఅ ఱఅజఱఅంఅఎశ్రీవ ఖశ్రీశ్రీ%. రోహిత్ వేముల వంటి సంఘటనలు మనకు ఒక పాఠం చెబుతున్నాయిఈ చట్టం నిజంగా ఫలితాలనివ్వాలంటే అది కేవలం శిక్షించే చట్టం కాకుండా నివారణాత్మక, నిర్మాణాత్మక, సాంస్కృతిక మార్పును తీసుకొచ్చే చట్టం కావాలి. ఇప్పటికే ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై దాడులు, అత్యాచారాల నిరోధక చట్టం 1989లోనే ఉంది. కానీ అది ప్రధానంగా గ్రామీణ సమాజంలో జరిగే బహిరంగ దౌర్జన్యాలపై మాత్రమే దృష్టి పెట్టింది. ఉన్నత విద్యలో కనిపించని సూక్ష్మ వివక్షలపై ఎటువంటి స్పష్టమైన నిబంధనలు లేవు. ఉదాహరణకు, ఒక విద్యార్థిని తరచుగా అతని ర్యాంక్, కులం, ఇంటిపేరు ఆధారంగా పరోక్షంగా అవమానించడం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంఈ రకమైన చర్యలు ఇప్పటి చట్టాల పరిధిలో సరైన రీతిలో పరిగణించబడవు. రోహిత్ వేముల చట్టం ఈ లోటును భర్తీ చేస్తూ, "కుల ఆధారిత వివక్ష" అనే పదాన్ని మొదటిసారి స్పష్టంగా నిర్వచించాలి. ఈ చట్టం విద్యా సంస్థలలో సమానత్వం కోసం ప్రత్యేకంగా "సమానత్వ కమిటీలు" ఏర్పాటు చేయాలని తప్పనిసరి చేయాలి. ఈ కమిటీలు విద్యార్థుల ఫిర్యాదులను స్వీకరించి, వాటిపై విచారణ జరిపి, తక్షణ చర్యలు సిఫార్సు చేయగలగాలి. ఆన్‌లైన్ ఫిర్యాదుల పోర్టల్, 24 గంటల హెల్ప్‌లైన్ వంటి సదుపాయాలు ఈ చట్టంలో తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థి ఎటువంటి మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నా, ఎవరిని సంప్రదించాలో తెలియక కంగారు పడకుండా, ఈ విధమైన పారదర్శక వ్యవస్థలు ఉండాలి. అదేవిధంగా, ఈ చట్టం విద్యార్థుల "కుల గోప్యతా హక్కు"ను రక్షించాలి. ప్రస్తుతం ఇంటిపేర్లు, సర్టిఫికెట్లు, నోటీసు బోర్డులు, హాజరు పట్టికలు అన్నింటి ద్వారా విద్యార్థి కుల గుర్తింపు బహిరంగమవుతుంది. ఇది ఇతరుల మానసికతలో ఒక రకమైన వ్యత్యాసాన్ని కలిగించి, అప్రత్యక్షంగా వివక్షను పెంచుతుంది. కాబట్టి, ఈ చట్టం అన్ని విద్యార్థులకు తమ ఇంటిపేర్లను బహిరంగ రికార్డుల నుంచి తొలగించుకునే హక్కును ఇవ్వాలి. డిజిటల్ డేటా ప్రొటెక్షన్ చట్టానికి అనుగుణంగా కఠినమైన గోప్యతా నిబంధనలు ఉండాలి. కులం, ర్యాంక్ వంటి వివరాలు కేవలం రిజర్వేషన్ ప్రయోజనాల కోసం మాత్రమే సంబంధిత అధికారులకు అందుబాటులో ఉండాలి. అధ్యాపకులు, సహ విద్యార్థులు వీటిని తెలుసుకునే పరిస్థితి లేకుండా చేయాలి. ప్రత్యేకంగా "ర్యాంక్ సంస్కృతి" అనే సమస్యపై ఈ చట్టం దృష్టి పెట్టాలి. జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల ర్యాంకులు విద్యార్థుల జీవితంలో ఒక ముద్రలా మారుతున్నాయి. ఒకసారి ర్యాంక్ ఆధారంగా గుర్తింపు ఏర్పడితే, అది జీవితాంతం విద్యార్థిని అనుసరిస్తుంది. అగ్ర ర్యాంకులు సాధించినవారు వాటిని ఆధిక్యంగా చూపుతారు, తక్కువ ర్యాంకులు సాధించినవారిని తక్కువ చేసి చూస్తారు. రిజర్వేషన్ వర్గాలకు చెందినవారు ఈ సందర్భంలో మరింత కించపరచబడతారు. కాబట్టి ఈ చట్టం ప్రకారం అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ర్యాంకులను గోప్యంగా ఉంచాలి. విశ్వవిద్యాలయాల వెబ్‌సైట్లు, బ్రోచర్లు, బహిరంగ వేదికలలో ర్యాంకులను ప్రకటించడం నిషేధించాలి. తరగతి గదుల్లో లేదా హాస్టల్ చర్చల్లో ర్యాంకులు ప్రస్తావనకెక్కకుండా విద్యార్థి హక్కులను రక్షించే విధానాలు ఉండాలి. విద్యా వాతావరణంలో ఉన్నత స్థాయి సమానత్వం ఏర్పడాలంటే కేవలం శిక్షలు సరిపోవు. అవగాహన కార్యక్రమాలు, సున్నితమైన బోధన, బహుళత్వాన్ని గౌరవించే పాఠ్యాంశాలు కూడా కీలక పాత్ర పోషించాలి. రోహిత్ వేముల చట్టం ప్రకారం ప్రతి విశ్వవిద్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక వర్క్‌షాప్‌లు, సదస్సులు నిర్వహించాలి. అధ్యాపకుల నియామకంలో, పరిపాలనా వ్యవస్థలో కుల వివిధత్వం ప్రతిబింబించాలి. పాఠ్యాంశాలలో అణగారిన వర్గాల చరిత్ర, కృషి, తత్వాలు కూడా ప్రతిబింబించాలి. ఈ చట్టం మానసిక ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలి. వివక్ష కారణంగా చాలా మంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. 2004 నుండి 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నత విద్యలో ఆత్మహత్య చేసుకోవడం దీనికి ఘోరమైన నిదర్శనం. ప్రతి విశ్వవిద్యాలయంలో మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ సెంటర్లు ఉండాలని చట్టం తప్పనిసరిచేయాలి. ఫిర్యాదు చేసిన విద్యార్థి రక్షణ పొందేలా సిస్టమ్ ఉండాలి. కేవలం శిక్షలపైనే ఆధారపడకుండా, ఈ చట్టం ఒక కొత్త విద్యా సంస్కృతిని తీసుకురావాలి. సమాజంలో శతాబ్దాలుగా కులం అనే మలిన భావన పాతుకుపోయి ఉన్నా, విద్యా ప్రాంగణం మాత్రం దానికి వేదికగా మారకూడదు. విద్యార్థి తన ప్రతిభతో, ఆలోచనతో, కృషితోనే గుర్తింపుపొందాలి. అతని ర్యాంక్, కులం, నేపథ్యం అతని భవిష్యత్తును నిర్దేశించకూడదు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పటికే రోహిత్ వేముల చట్టాన్ని పరిశీలిస్తున్నాయి. ఈ రాష్ట్రాలు కేవలం శిక్షలకే ప్రాధాన్యం ఇవ్వకుండా, నివారణ చర్యలకు కూడా సమాన ప్రాముఖ్యత ఇవ్వాలి. ఈ చట్టం యొక్క అసలు బలం విద్యా వాతావరణంలో సమానత్వాన్ని సృష్టించడంలోనే ఉంది. రోహిత్ వేముల చట్టం నిజంగా రోహిత్ కలలను నెరవేర్చాలంటే, అది విద్యా వ్యవస్థలో ఒక శాశ్వత సాంస్కృతిక మార్పుని ప్రారంభించాలి. చివరగా, రోహిత్ వేముల చట్టం కేవలం ఒక చట్టపుస్తకంలో నిలిచిపోకుండా, జీవన వాస్తవికతలో ప్రతిధ్వనించాలి. ప్రతి విద్యార్థి గౌరవంగా, భద్రంగా, సమాన అవకాశాలతో చదువుకునే హక్కు కలిగిన వాతావరణం కల్పించాలి. రోహిత్ వంటి విద్యార్థులు మరలా తమ జీవితాలను కోల్పోకుండా, కుల వివక్ష అనే శృంఖలాలను పూర్తిగా చెరిపేయగల సత్తా ఈ చట్టానికి రావాలి. అప్పుడు మాత్రమే అది నిజమైన నివాళిగా, రోహిత్ వేముల కలల భారతదేశానికి పునాది రాయిగా నిలుస్తుంది.

# సుడాన్‌పై ప్రపంచం నిద్ర నటించడం ఆపాలి



సుడాన్‌లోని పశ్చిమ డార్ఫూర్ ప్రాంతంలో జరిగిన కొండచరియల విషాదం ఒక ప్రకృతి వైపరీత్యం కాదు. అది మానవత్వంపై పడిన ఒక గట్టి దెబ్బ. తారసిన్ గ్రామం మొత్తం భూమిలో కలిసిపోయి, వేల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ విషాదం కేవలం భారీ వర్షాల వల్ల జరిగిందని మనం నమ్మితే అది మన అమాయకత్వమే. ఈ ఘోరం వెనుక రెండేళ్లుగా రగులుతున్న అంతర్యుద్ధం, ప్రపంచ దేశాల నిర్లక్ష్యం ఉన్నాయి. ఈ భయంకరమైన విషాదం చూసైనా ప్రపంచం కళ్ళు తెరవాలి. లేకపోతే ఈ విధ్వంసం ఇంకా పెద్దదిగా మారుతుంది.

?అంతర్యుద్ధం- విలవిలలాడుతున్న కథ:

?సుడాన్‌లోని సైనిక బలగాలు, పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య జరుగుతున్న యుద్ధం ఆ దేశాన్ని ముక్కలు చేసింది. ఈ యుద్ధం అధికార దాహం, ఆర్థిక ఆధిపత్యం కోసం నాయకుల మధ్య సాగుతున్న ఓ అగ్నిపరీక్ష. ఈ యుద్ధంలో లక్షలాది మంది ప్రజలు సర్వం కోల్పోయి వీధిన పడ్డారు. ప్రాణాలు దక్కించుకోవడానికి పర్వత ప్రాంతాలకు పారిపోయిన వేలాది మందికి, పర్వతాలు ఆశ్రయం ఇవ్వడానికి బదులుగా మరణాన్ని ఇచ్చాయి. బాంబులు, తూటాలకు భయపడి కొండల మీద తలదాచుకున్న వీరికి, ఆ కొండలే యమదూతలుగా మారాయి. యుద్ధం ప్రజలను బతికే అవకాశం ఇవ్వకుండా, మరణం వైపు నెట్టివేసిందని ఈ సంఘటన తేటతెల్లం చేసింది. ఇది కేవలం ఒక వార్త కాదు ఇది మానవత్వం మర్చిపోయిన ఒక జాతి యొక్క కన్నీటి గాథ. ?ఈ విషాదం వెనుక దశాబ్దాల చరిత్ర ఉంది. డార్ఫూర్ ప్రాంతం సుడాన్‌లోని ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా నిర్లక్ష్యానికి గురైంది. ఇక్కడి ప్రజలు తరతరాలుగా నీరు, భూమి కోసం పోరాటాలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇక్కడి తిరుగుబాటు గ్రూపులు ఆయుధాలు పట్టుకోవడానికి ఇదే ప్రధాన కారణం. 2003లో జరిగిన డార్ఫూర్ యుద్ధంలో లక్షలాది మంది ప్రజలు చనిపోయారు. దాని తర్వాత కూడా పూర్తి శాంతి నెలకొనలేదు. ఇప్పుడు జరుగుతున్న తాజా యుద్ధం పాత గాయాలపై మళ్ళీ ఉప్పు చల్లినట్లుగా ఉంది. ప్రజల బాధలు, వేదనలు, కష్టాలు వర్ణనాతీతం.

**రాజకీయాల వైఫల్యం -చేతకాని పాలన:**

ఈ విషాదం జరిగినప్పుడు సుడాన్‌లోని నాయకుల స్పందన చూస్తే ఛీ అనిపిస్తుంది. ప్రజల బాధను పట్టించుకోకుండా వారు తమ అధికారం కోసం కొట్టుకుంటూనే ఉన్నారు. సహాయక బృందాలు బాధితుల వద్దకు చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడు, యుద్ధం వల్ల రోడ్లన్నీ మూసుకుపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడటానికి ఉన్న తొలి కొన్ని గంటలు ఈ నాయకుల చేతకానితనం వల్ల వృథా అయ్యాయి. ఈ సంఘటన, సుడాన్‌లోని సైనిక నాయకులకు ప్రజల ప్రాణాల కంటే అధికారం మాత్రమే ముఖ్యమని రుజువు చేసింది. ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వమే పౌరులను గాలికి వదిలేసింది.

**ప్రపంచం ఎందుకు ప్రేక్షక పాత్ర పోషిస్తోంది:**

సుడాన్‌లో జరుగుతున్న ఈ దుర్ఘటనపై ప్రపంచ సమాజం స్పందించిన తీరు మనల్ని ఆలోచింపజేస్తుంది. ఉక్రెయిన్ - రష్యా యుద్ధం, ఇజ్రాయెల్ - పాలస్తీనా సంఘర్షణపై ప్రపంచ దేశాలు చూపించినంత ఆసక్తిని సుడాన్‌పై చూపించడం లేదు. దీని వెనుక ప్రధాన కారణం ఆర్థిక ప్రయోజనాలు లేకపోవడం. సుడాన్‌లో బంగారం, చమురు, ఇతర విలువైన ఖనిజాలు ఉన్నప్పటికీ, ఈ సంఘర్షణలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటే ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ సమస్యల వల్ల ప్రపంచ దేశాలు దూరంగా ఉంటున్నాయి. వార్తా సంస్థలు కూడా దీనిపై పెద్దగా దృష్టి సారించలేదు. ఈ నిర్లక్ష్యం, సుడాన్ ప్రజల బాధలు, వేదనను ప్రపంచ దృష్టికి రానీయకుండా చేసింది. సుడాన్ ప్రజలు ఒంటరిగా ఈ భయంకరమైన పోరాటంలో ఉన్నారని ఈ మౌనం స్పష్టం చేస్తుంది.

**బాధిత ప్రజల ఆర్తనాదం:**

ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వేలాది మంది ప్రజల కథలను మనం వినలేకపోతున్నాం. బతికి బయటపడినవారి ఆర్తనాదాలు కూడా ఎవరి చెవికీ వినిపించడం లేదు. ఒక చిన్నారి తన తల్లిదండ్రులను కోల్పోయి ఏడుస్తున్న దృశ్యం, ఒక వృద్ధుడు తన ఇల్లు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో నిలబడి ఉన్న చిత్రం. ఇవన్నీ కేవలం కథనాలు కాదు, అవి ఈ యుద్ధం సృష్టించిన నిజమైన విషాదాలు. ఆ గ్రామంలో మిగిలి ఉన్న కొన్ని శిథిలాలు, కూలిన ఇళ్లు, అక్కడక్కడా కనిపిస్తున్న వస్తువులు ఆ ప్రాంత ప్రజల జీవితాలు ఎంత దయనీయంగా ఉన్నాయో చెబుతున్నాయి. సహాయం కోసం వారు ఎదురుచూస్తున్న కళ్ళు, మనల్ని ప్రశ్నిస్తున్నట్లుగా ఉన్నాయి.

**శాశ్వత శాంతి ఒక్కటే మార్గం:**

ఈ విపత్తుకు పరిష్కారం కేవలం బాధితులకు ఆర్థిక సహాయం ఇవ్వడం మాత్రమే కాదు. అంతర్జాతీయ సమాజం తక్షణమే మానవతా సహాయాన్ని అందించాలి. కానీ అంతకంటే ముఖ్యంగా ఈ సంక్షోభానికి ప్రధాన కారణమైన అంతర్యుద్ధాన్ని ముగించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఐక్యరాజ్యసమితి, ఆఫ్రికన్ యూనియన్ వంటి అంతర్జాతీయ సంస్థలు తక్షణమే శాంతి చర్చలు ప్రారంభించి, పోరాట వర్గాలపై ఒత్తిడి తీసుకురావాలి. కొత్తగా ఒక నిజమైన పౌర ప్రభుత్వం ఏర్పడినప్పుడే, సుడాన్ తన పౌరుల భద్రతను తిరిగి నిర్మించగలదు. అప్పుడే విపత్తు నిర్వహణ, పునరావాస కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టగలరు. రాజకీయ సుస్థిరత లేకపోతే సుడాన్ ప్రజలు ఇలాగే ప్రకృతి, మానవ నిర్మిత విపత్తుల వల్ల నిరంతరం ప్రాణాలు కోల్పోతూనే ఉంటారు. ఈ విషాదం నుండి ప్రపంచం పాఠాలు నేర్చుకొని, సుడాన్‌లో శాంతి స్థాపనకు కృషి చేయాలి. లేకపోతే, తమ పౌరుల భద్రత కంటే అధికారం ముఖ్యమని భావించే నాయకుల చేతుల్లో ఆ దేశం నిరంతరం నాశనమవుతూనే ఉంటుంది.

డి జె మోహనరావు
8247045230



# ఆపదలో అఫ్ఘాన్.. నిరాశ్రయులైన ప్రజలు



అఫ్ఘానిస్తాన్ అనే దేశం పేరు వినగానే మన కళ్లముందు ఒక అంతులేని దుఃఖ గాథ ప్రత్యక్షమవుతుంది. శతాబ్దాలుగా యుద్ధాల వేదికగా, శక్తుల పోట్లాటలకు బలిపశువుగా, ప్రకృతి కోపానికి తరచూ గురైన ఈ నేలపై ప్రజల జీవితాలు ఎప్పటికీ ఒక ప్రశాంతతను చూడలేదు. ఒకప్పుడు సాంస్కృతిక వైభవానికి, వ్యాపార మార్గాలకు నిలయంగా నిలిచిన ఈ దేశం, 20వ శతాబ్దం ద్వితీయార్థం నుంచి వరుసగా యుద్ధాలు, తిరుగుబాట్లు, బాహ్య జోక్యాలు, అంతర్గత విభేదాల కాచిగూడు అయిపోయింది. తాజాగా సంభవించిన భూకంపం ఈ దేశ ప్రజలపై మరోసారి మహా విపత్తును మోపింది. ఇప్పటికే ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా కుంగిపోయిన అఫ్ఘానిస్తాన్‌కు ఇది మరొక దుర్ఘటన. నాలుగు సంవత్సరాల క్రితం ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని కూలద్రోసి తాలిబన్లు మళ్లీ అధికారంలోకి రావడం అఫ్ఘాన్ చరిత్రలో మరొక దారుణ మలుపు. 20 సంవత్సరాలపాటు సాగిన అమెరికా జోక్యం, బిలియన్ల డాలర్ల పెట్టుబడులు, రక్తపాతం, మృతుల బలిదానాలు. తాలిబన్లు అధికారంలోకి వచ్చిన వెంటనే రాజ్యాంగం రద్దయింది, పౌర హక్కులు తుంగలో తొక్కబడ్డాయి, మహిళలు మళ్లీ నాలుగు గోడల మధ్య బంధించబడ్డారు. బాలికల విద్యపై నిషేధం విధించబడింది. ప్రజలు శ్వాసించడానికే భయపడే విధంగా మతఛాందస పాలనకు లోనయ్యారు. అంతర్జాతీయ సమాజం కొత్త ప్రభుత్వానికి న్యాయబద్ధత ఇవ్వక, సహాయ సహకారాలను నిలిపివేయడంతో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కూలిపోయింది. బ్యాంకులు మూతపడ్డాయి, అంతర్జాతీయ వాణిజ్యం నిలిచిపోయింది. ప్రజల జీవనోపాధి పూర్తిగా క్షీణించింది. ఈ దారుణ పరిస్థితుల్లోనే ఒక విపరీత భూకంపం సంభవించడం అఫ్ఘాన్ ప్రజలకు దురదృష్టం. రిక్టర్ స్కేల్‌పై 6.3 తీవ్రతతో నమోదైన ఈ ప్రకృతి విపత్తు వందలాది ప్రాణాలను బలిగొంది. వేలాది గృహాలు కూలిపోయాయి, నిరాశ్రయులైన ప్రజలు శిథిలాల మధ్య మానవతా సహాయానికి ఎదురుచూస్తున్నారు. భూకంపం అన్నది అఫ్ఘానిస్తాన్‌లో కొత్త విషయం కాదు. ముఖ్యంగా హిందూ కుష్ పర్వత శ్రేణులు కలిసే ఈశాన్య ప్రాంతం తరచూ భూకంపాల వేదికగా మారుతుంది. 2023లో హెరాత్‌లో జరిగిన భారీ భూకంపం ఇప్పటికీ ప్రజల జ్ఞాపకాల్లో ఉంది. తరచూ ఈ విధమైన విపత్తులు జరగడానికి భౌగోళిక కారణాలు ఉన్నప్పటికీ, ప్రతి సారి ఇంత పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరగడానికి ప్రధాన కారణం అఫ్ఘాన్ ప్రజల ఆర్థిక బలహీనత. "భూకంపాలు మనుషులను చంపవు, భవనాలు చంపుతాయి" అన్న మాట ఈ దేశానికి అద్దం పట్టుతుంది. న్యూజీలాండ్, చిలీ వంటి దేశాల్లో కూడా ఇలాంటి తీవ్రతతో భూకంపాలు సంభవిస్తున్నా, ప్రాణనష్టం చాలా తక్కువగా ఉంటుంది. కారణంఆ దేశాల్లో భవన నిర్మాణ నిబంధనలు కచ్చితంగా అమలు కావడం, ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం. కానీ అఫ్ఘానిస్తాన్‌లో పేదరికం కారణంగా ఎక్కువ ఇళ్లు మట్టి, రాళ్లు, కలపతోనే కట్టబడ్డాయి. ఇంజనీరింగ్ ప్రణాళికలు లేకుండా నిర్మాణం చేయడం వల్ల చిన్న భూకంపానికే ఇళ్లు కూలిపోతాయి. ఒక విపత్తు రాగానే వేలాది మంది బలి అవ్వడం ఈ పరిస్థితుల ఫలితం. ఇలాంటి సమయంలో అంతర్జాతీయ సమాజం ఎటువంటి ధోరణి అవలంబించాలి అన్నది ఒక పెద్ద ప్రశ్న. తాలిబన్ ప్రభుత్వానికి సహాయ సహకారం అందించడం అంటే మతఛాందస పాలనకు న్యాయబద్ధత ఇవ్వడం అవుతుందని అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. అయితే ఈ సహాయం అందకపోవడం వల్ల బాధపడుతున్నది తాలిబన్ కాదు, సాధారణ అఫ్ఘాన్ ప్రజలే. ఆహారం లేక, ఆరోగ్య సదుపాయాలు లేక, విద్య లేక, ఇప్పుడు ప్రకృతి విపత్తుల దెబ్బతో మరింత దయనీయ స్థితికి చేరుకున్నారు. డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అమెరికా అధ్యక్షుడిగా రావడంతో అమెరికా నుంచి కూడా మానవతా సహాయం నిలిచిపోయింది. ఇప్పటికే నిరాశ్రయులైన లక్షలాది శరణార్థులు పొరుగు దేశాలకు వలస వెళ్ళి, శిబిరాల్లో దయనీయంగా బ్రతుకుతున్నారు. ఈ సందర్భంలో అఫ్ఘాన్ ప్రజల పట్ల కనీస మానవతా దృష్టితో ప్రపంచం వ్యవహరించాలి. రాజకీయ లెక్కలు, పాలనా రూపాలు, మత నిబంధనలు అన్నీ పక్కన పెట్టి, ముందుగా ఆ ప్రాణాలను రక్షించాలి. భారతదేశం గతంలో అఫ్ఘాన్ పార్లమెంట్ భవనం నిర్మించగా, ఇప్పుడు అక్కడి ప్రజలకు భద్రమైన గృహాలు నిర్మించే సాంకేతిక సహాయం అందించడం ఒక సముచిత దిశ అవుతుంది. భారతీయ ఇంజనీర్లు అభివృద్ధి చేసిన తక్కువ వ్యయంతో కానీ భూకంపాలను తట్టుకునే గృహ నిర్మాణ పద్ధతులను అఫ్ఘాన్‌కు అందించవచ్చు. స్ట్రక్చరల్ ఇంజనీర్ ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్ ఆర్య అభివృద్ధి చేసిన పద్ధతులు ఇక్కడి పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయి. అంతర్జాతీయ దాత సంస్థలు ఆర్థిక సాయం అందిస్తే, అఫ్ఘాన్‌లో ఒక కొత్త పునర్నిర్మాణ దిశ ప్రారంభం అవుతుంది. ప్రకృతి విపత్తులు ఎప్పుడు వస్తాయో ఎవరికీ తెలియదు. కానీ వాటికి మనుషులు బలి కావడం, సమాజం కూలిపోవడం సహజం కాదు. అఫ్ఘాన్‌లో ప్రాణ నష్టం భారీగా జరుగుతున్నది అక్కడి పేదరికం, నిర్లక్ష్యం, మౌలిక సదుపాయాల లోటు వల్లే. ఇది ప్రపంచానికి ఒక హెచ్చరిక. ఒక ప్రాంతాన్ని అంతర్జాతీయ రాజకీయాలలో వేరుచేసి, శిక్షించాలనే ఉద్దేశంతో ప్రజలను నిర్లక్ష్యం చేయడం ఎంత ఘోరమైన పరిణామాలకు దారితీస్తుందో ఈ ఉదాహరణ చూపిస్తోంది.

## గురువుకు వందనం

క్షీరము నిచ్చేది ధేనువు
జ్ఞానము నిచ్చేది గురువు
దేవ గురువు బృహస్పతి
గురుదేవుడెప్పుడూ సరస్వతే!!

అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపించేది గురువు
మంచి మనిషిగా తీర్చిదిద్దేది గురువు
మంచిని బోధించేది గురువు
గురువు లేని విద్య గుడ్డి విద్య!!

విజ్ఞానం పంచేది గురువు
తన విద్యను ధారపోసేది గురువు
ప్రపంచంలో అన్నిటికీ రెండు కొమ్ములే ఉంటే
మూడు కొమ్ములు ఉన్నవాడు గురువు!!

గు=1 రు =2 వు =3



దేవులపల్లి రమేశ్.
నంగునూర్,
సిద్దిపేట జిల్లా
చరవాణి :-
9963701294

# విశ్వమానవ విలువల సమాహారం ప్రవక్త జీవితం

భక్తి



మానవజాతి చరిత్రలో ముహమ్మద్ ప్రవక్త (స) అవతరణ ఒక విప్లవాత్మక మలుపు. ఆ కాలంలో మానవ సమాజం చీకట్లలో మునిగిపోయి, అన్యాయం, అసమానత, అణచివేత, తెగలమధ్య యుద్ధాలతో అరేబియా భూభాగం నిత్య రణరంగంగా రగులుతూ ఉండేది. ఇలాంటి సమయంలో ప్రవక్త అవతరణ కేవలం ఒక మతపరమైన సంఘటన కాదుబీ అది ఒక సామాజిక, రాజకీయ పునరుజ్జీవన యుగానికి ప్రారంభం. ముహమ్మద్ ప్రవక్త (స) సమాజానికి అందించిన గొప్ప బోధన న్యాయం. ఆయన చెప్పిన 'బలహీనుల హక్కులు కాపాడని సమాజం బలవంతుల ఆధీనంలో దోపిడీకి గురవుతుంది' అన్న సందేశం కేవలం మతపరమైనది కాదు, సామాజిక న్యాయానికి పునాది. ఆయన కాలంలో ఆడవారిని వారసత్వానికి అర్హులుగా గుర్తించడం, బానిసలకు హక్కులు కల్పించడం, సమాజంలోని పేదవారికి సహాయం చేయడం.. ఇవన్నీ ఒక సామాజిక విప్లవం. రాజకీయంగా కూడా ముహమ్మద్ ప్రవక్త (స) ఒక కొత్త ఆదర్శం నెలకొల్పారు. మదీనాలో ఆయన ఏర్పాటు చేసిన మదీనా చార్టర్ అనేది మానవ చరిత్రలో తొలి వ్రాతబద్ధమైన రాజ్యాంగాల్లో ఒకటి. ముస్లింలతో పాటు యూదులు, ఇతర మతస్తులు కూడా అందులో భాగమయ్యారు. ఈ పత్రం మత స్వేచ్ఛ, సహజీవనం, పౌర హక్కులు, సమాన న్యాయం అనే విలువలకు పునాది వేసింది. నేటి ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలు చెప్పుకునే సూత్రాలు అప్పటికే ప్రవక్త (స) అమలు చేసి చూపించారు. ప్రవక్త (స) చూపిన రాజకీయ రహదారి



అధికారంకోసం అధికారం కాదు, న్యాయంకోసం అధికారం. ఆయన పాలనలో సామాజిక వర్గాల మధ్య గీతలు చెరిపివేయబడ్డాయి. మక్కావిజయానంతరం ఆయన తన శత్రువులకే క్షమాభిక్ష పెట్టిన తీరు ప్రపంచ రాజకీయ చరిత్రలో అరుదైన ఉదాహరణ. ప్రతీకారానికి బదులు క్షమ, అణచివేతకు బదులు సమానత్వం, అధికారానికి బదులు సేవ.. ఇవి ప్రవక్త (స) రాజకీయ తత్వం. ముహమ్మద్ ప్రవక్త (స) చూపిన జీవన విధానం కేవలం మతపరమైన ఆచారాలకే పరిమితం కాలేదు. ఆయన ప్రతి రంగంలోనూ సమాజానికి మార్గదర్శకుడయ్యారు. ముఖ్యంగా సామాజిక సమానత్వం విషయంలో ఆయన చూపిన నమూనా అసాధారణం. ఆ కాలంలో గోత్రవాదం, జాత్యహంకారం తీవ్రంగా ఉండగా, ఆయన అందరినీ ఒకే మానవ కుటుంబ సభ్యులుగా భావించారు. 'ఒక అరబ్బుకు అరబ్బేతరునిపై, అరబ్బేతరునికి అరబ్బుపై ఎలాంటి అధికారం లేదు. శ్రేష్ఠతను నిర్ణయించేది కేవలం దైవభీతి (తక్వా)' మాత్రమే అని ఆయన చివరి ఉపన్యాసంలో స్పష్టంగా చెప్పారు. ఈ సందేశం సమాజంలో ఉచ్ఛనీచాలు, వివక్ష, కుల భేదాలు, జాత్యహంకారాలకు గట్టి సవాలు.

అలాగే ప్రవక్త (స) రాజకీయ దృక్కోణం నేటి మన సమాజానికి మార్గదర్శకం. ఆయన చూపిన శక్తి వినియోగం కేవలం రక్షణ కోసం మాత్రమే. ఆయన పాలనలో న్యాయస్థానం ముందు సంపన్నుడు, పేదవాడు, బంధువు, పరాయి అన్న తేడా లేకుండా ఒకే న్యాయం అమలయ్యేది. ఒకసారి ఖురైష్ వంశానికి చెందిన ఒక ప్రభావవంతురాలు దొంగతనం చేసినప్పుడు, ఆమెను మినహాయించాలని కొందరు ప్రయత్నించగా, ప్రవక్త (స) దానికి ఘాటుగా సమాధానం చెప్పారు:'ఒకవేళ నా కుమార్తె ఫాతిమా దొంగతనం చేసినా, నేను ఆమె చేతిని కూడా నరికిస్తాను.' అన్నారు. ఇది ఆయనకు న్యాయసూత్రాల పట్ల ఉన్న నిబద్ధత ఎంత బలమైనదో చూపిస్తుంది. నేటి రాజకీయ వ్యవస్థల్లో కనిపించే అవినీతి, బంధుప్రీతి, అన్యాయానికి ఇది ఒక గొప్ప గుణ పాఠం. దైవప్రవక్త (స) చూపిన దారి ప్రపంచ శాంతికి ఒక దిక్సూచి. ఆయన యుద్ధాలను ఎప్పుడూ చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే స్వీకరించారు. శాంతి చర్చలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చారు. హుదైబియా ఒప్పందం దీనికి పెద్ద ఉదాహరణ. తాత్కాలికంగా ముస్లింలకు నష్టంగా కనిపించినా, ఆయన దూరదృష్టితో ఆ ఒప్పందాన్ని అంగీకరించారు. చివరికి అదే ఇస్లాం వ్యాప్తికి బలమైన కారణమైంది. దీనిద్వారా మనకు తెలిసేది ఏమిటంటే, నిజమైన నాయకత్వం తక్షణ లాభం కోసం కాకుండా, భవిష్యత్తు తరాల కోసం దూరదృష్టితో నిర్ణయాలు తీసుకోవడమే.

ఈ రోజు మన సమాజంలో మతం పేరుతో, కులం పేరుతో హింస, రాజకీయాలలో ద్వేష ప్రసంగాలు, సామాజిక అన్యాయాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ముహమ్మద్ ప్రవక్త (స) చూపిన మార్గం ఎంతైనా అవసరం. ఆయన బోధనల ద్వారా మనకు అర్థమయ్యేదేమిటంటే, నిజమైన భక్తి కేవలం పూజా పునస్కారాల్లో కాదుబీ అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడడంలో, బలహీనులను రక్షించడంలో, సమాజంలో న్యాయాన్ని నెలకొల్పడంలో ఉంది. ప్రవక్త (స) జన్మదినం సందర్భంగా మనం నేర్చుకోవలసిన అసలు పాఠం, ఆయన చూపిన మార్గాన్ని జీవితంలో ఆచరణలో పెట్టడం. వ్యక్తిగత ఆధ్యాత్మిక స్ఫూర్తిగానే కాకుండా, ఒక సామాజిక, రాజకీయ మార్గదర్శకుడిగా ఆయన వారసత్వాన్ని మనం తిరిగి నిలబెట్టుకోగలగాలి. ముహమ్మద్ ప్రవక్త (స) జీవిత సందేశం కేవలం ఒక మతపరమైన బోధన కాదుబీ అది న్యాయం, కరుణ, సమానత్వం, శాంతి అనే విశ్వమానవ విలువల సమాహారం. ఆయన చూపిన మార్గాన్ని మనం మన వ్యక్తిగత జీవితంలో, కుటుంబంలో, సమాజంలో, రాజకీయాల్లో ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన మౌలిక మార్పు సాధ్యమవుతుంది. కులం, మతం, జాతి, భాష అనే అడ్డుగోడలను కూల్చి, పరస్పర గౌరవం, సహజీవనం, ప్రేమతో మానవజాతిని ఒకే కుటుంబంగా నిలబెట్టడమే నిజమైన ధర్మం. ఇదే నేటి ప్రపంచానికి అత్యవసరమైన సందేశం.

**(నేడు, ముహమ్మద్ ప్రవక్త (స) జయంతి 'మిలాదున్నబీ' సందర్భంగా..)**

**- యండి. ఉస్మాన్ ఖాన్**
**సీనియర్ జర్నలిస్ట్**



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
శుక్రవారం
05 । సెప్టెంబర్ ।

# సైబర్ నేరాలకు వాడుతున్న 2 కోట్ల ఫోన్ కనెక్షన్లు బ్లాక్



**న్యూఢిల్లీ-నవభూమి:** సైబర్ నేరాల కోసం ఉపయోగిస్తున్న 2కోట్ల ఫోన్ కనెక్షన్లను కేంద్ర టెలి కమ్యూనికేషన్స్ విభాగం(డీవోటీ)బ్లాక్ చేసింది. టెలికమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి నీరజ్ మిత్తల్ ఈ విషయాన్ని వెల్లడించారు. బుధవారం గోవాలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ సదస్సులో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. సంచార్ సాథీ యాప్ వల్ల ఇది సాధ్యమైందన్నారు. సైబర్ నేరగాళ్లు చేసే స్పూఫ్ కాల్స్‌ను ఈ యాప్ సాయంతో 97శాతం తగ్గించామన్నారు. టెలికమ్యూనికేషన్స్‌లో భద్రత కోసం డీవోటీ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, ప్రైవేటు సంస్థలతో కూడా కలిసి పనిచేస్తోందని వివరించారు.

## కొత్తగా మీ ముందుకొస్తున్నాం.. రెస్టారెంట్ మూసివేతపై క్లారిటీ ఇచ్చిన శిల్పా శెట్టి



**ముంబై-నవభూమి:** బాలీవుడ్ నటి శిల్పాశెట్టి తన రెస్టారెంట్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించి అందరికీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. 2016లో బాంద్రా ప్రాంతంలో శిల్పా శెట్టి తన తొలి బ్రాంచ్‌ను ప్రారంభించారు. ముంబై నగరంలోనే ఈ బాస్టియన్ రెస్టారెంట్‌కు మంచి పేరుంది. అయితే, అనూహ్యంగా దీన్ని మూసివేస్తున్నట్లు నిన్న సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. అందుకుగల కారణాలను మాత్రం ఆమె వెల్లడించలేదు. దీంతో అందుకు గల కారణాలు తెలుసుకునేందుకు నెటిజన్లు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు 'రెస్టారెంట్‌ను ఎందుకు మూసివేస్తున్నారు..?' అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై నటి శిల్పా శెట్టి క్లారిటీ ఇచ్చారు. 'బాస్టియన్' రెస్టారెంట్‌ను మూసేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత తనకు వేల సంఖ్యలో ఫోన్‌కాల్స్ వస్తున్నాయని తెలిపారు. దాన్ని పూర్తిగా మూసివేయడం లేదని క్లారిటీ ఇచ్చారు. తాము ఓ అధ్యాయాన్ని ముగించామని వివరించారు. 'బాస్టియన్ బీచ్ క్లబ్' పేరుతో జుహు ప్రాంతంలో కొత్తగా ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. దక్షిణ భారతదేశంలో మంగుళూరు వంటకాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఎన్ని బ్రాంచ్‌లు తెరిచినా బాంద్రాలోని రెస్టారెంట్ మాత్రమే వాటికి మూలం అని పేర్కొన్నారు. ఇది ఎప్పటికీ ప్రత్యేకమేనని దీన్ని పూర్తిగా మూసివేస్తాం అనే ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. అక్టోబర్‌లో దీన్ని జుహూలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. బాస్టియన్‌ను మూసివేస్తున్నాం.. శిల్పాశెట్టికాగా, ఈ రెస్టారెంట్‌ను మూసివేస్తున్నట్లు శిల్పాశెట్టి సోషల్ మీడియా వేదికగా తెలుపుతూ.. ముంబైలో ఎంతో పాపులర్ అయిన బాస్టియన్‌కు వీడ్కోలు పలుకుతున్నాం. ఈ గురువారం బాస్టియన్ బాంద్రాకు చివరిరోజు. ఇది ముంబైలోని ఐకానిక్ డెస్టినేషన్స్‌లో ఒకటిగా నిలిచిపోయింది. లెక్కలేనన్ని జ్ఞాపకాలు, మర్చిపోలేని రాత్రులు, నగర నైట్‌లైఫ్‌ను మార్చిన క్షణాలను ఇది మాకు ఇచ్చిందంటూ శిల్పా రాసుకొచ్చింది. అయితే శిల్పా ఈ రెస్టారెంట్‌ను మూసివేయడానికి గల కారణాన్ని వెల్లడించలేదు. తనపై తన భర్తపై నమోదైన రూ. 60 కోట్ల మోసం కేసు నేపథ్యంలో శిల్పా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నెట్టింట ప్రచారం జరిగింది. ఒక వ్యాపారవేత్తను పెట్టుబడి పేరుతో మోసం చేశారని ఈ దంపతులపై ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా రెస్టారెంట్ మూసివేతకు గల కారణాలను వెల్లడించారు శిల్పా.

## పోటీ పరీక్షలు రాసే దివ్యాంగులకు కొత్త నిబంధనలు.. సొంత స్క్రైబ్‌లను తీసుకెళ్లడానికి వీల్లేదు



**న్యూఢిల్లీ-నవభూమి:** దివ్యాంగులు పరీక్షలు, పోటీ పరీక్షలు రాయడానికి ఇబ్బంది పడకుండా.. వారికి సహాయకులను తెచ్చుకునేందుకు అవకాశం కల్పిస్తారు. వీరినే స్క్రైబ్ అంటారు. అయితే కొన్ని రకాల పరీక్షలకు యాజమాన్యాలే స్క్రైబ్‌లను అలాట్ చేస్తే.. కొన్నింటికి దివ్యాంగులే సొంతంగా స్క్రైబ్‌లను తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. అయితే సొంతంగా స్క్రైబ్‌లను తీసుకుని వెళ్లడం వల్ల పరీక్షల్లో అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోటీ పరీక్షలు రాసే దివ్యాంగుల స్క్రైబ్‌ల విషయంలో కేంద్రం నిబంధనలను కఠినతరం చేసింది. ఆ వివరాలు..పోటీ పరీక్షల్లో దివ్యాంగులకు సాయం చేసే స్క్రైబ్‌ల విషయంలో కేంద్రం నిబంధనలను కఠినతరం చేసింది. పరీక్షా సమయంలో అవకతవకలను అరికట్టేందుకు గాను కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగులే సొంతంగా స్క్రైబ్‌లను తెచ్చుకునే విధానానికి ముగింపు పలకాలని.. దశలవారీగా దీనికి స్వస్తి పలకాలని కేంద్రం నిర్ణయించింది. అంతేకాక దేశంలో పలు పోటీ పరీక్షలు నిర్వహించే యూపీఎస్సీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, ఎస్ఎస్‌సీ వంటి సంస్థలు.. వారే స్వయంగా నిష్ణాతులైన స్క్రైబ్‌లను తయారు చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది. ఇకపై నిర్వహించే పోటీ పరీక్షల్లో ఆయా సంస్థలు సిద్ధం చేసిన స్క్రైబ్‌లనే దివ్యాంగులకు సహాయకులుగా కేటాయించాలని పేర్కొంది. రానున్న రెండేళ్లలో దీన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సొంత స్క్రైబ్‌లకు అనుమతి ఇవ్వాలని తెలిపింది. అలానే స్క్రైబ్‌గా తీసుకునే అభ్యర్థి వయసు.. పరీక్ష రాసే అభ్యర్థి కన్నా 2, 3 విద్యాసంవత్సరాలు తక్కువగా ఉండాలని.. అలాంటి వారినే స్క్రైబ్‌లుగా తీసుకోవాలని కేంద్రం సూచించింది. అలానే పరీక్ష రాసే అభ్యర్థి, స్క్రైబ్ ఒకే పరీక్ష కోసం ప్రిపేర్ అవుతూ ఉండకూడదని తెలిపింది. దీనికి సంబంధించి తాజాగా సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సవరించిన మార్గదర్శకాలను రిలీజ్ చేసింది. పోటీ పరీక్షల్లో అవకతవకలు జరగకుండా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్రం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సవరించిన ఈ నియమాలు అన్ని ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలతో పాటుగా సాంకేతి విద్యా ప్రవేశాలు, ప్రొఫెషనల్ ఎగ్జామ్స్‌కు కూడా వర్తిస్తాయని వివరించింది. అలానే దివ్యాంగ అభ్యర్థులు స్క్రైబ్‌ల మీద ఆధారపడకుండా.. వారి కోసం సాఫ్ట్‌వేర్ ఎనెబుల్డ్ ల్యాప్‌టాప్‌లు, బ్రెయిలీ, రికార్డింగ్ పరికరాలు, పెద్ద ప్రింట్‌లు వంటి ఇతర టెక్నికల్ సాధనాలు వినియోగించుకుని.. సొంతంగా పరీక్షలు రాసేలా వారిని ప్రోత్సాహించాలని తెలిపింది. ఈ విధానాల వల్ల వారు రేపు ఆఫీసుల్లో విధులు నిర్వర్తించే సమయంలో స్వతంత్రంగా వారి పనులు వారు చేసుకునే అవకాశం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సుంకాలతో భారత్ మమ్మల్ని చంపేసింది.. మరోసారి ట్రంప్ విమర్శలు



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్ సుంకాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారీ టారీఫ్‌లో భారత్ మమ్మల్ని చంపేస్తోందని ఆరోపించారు. అంతేకాదు, అమెరికాపై ఎలాంటి సుంకాలు వేయబోమని న్యూఢిల్లీ ఆఫర్ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. ట్రంప్ అదనపు సుంకాల విధించడంతో భారత్, అమెరికా వాణిజ్య సంబంధాల్లో ప్రతిష్టంభన నెలకున్న వేళ.. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అలాగే, భారత్‌తో పాటు చైనా, బ్రెజిల్‌పై అమెరికా అధినేత ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాపై సుంకాలు వేస్తున్నాయి... చైనా సుంకాలతో చంపేస్తోంది.. టారీఫ్‌లతో భారత్ మమ్మల్ని దెబ్బతీస్తోంది..బ్రెజిల్ కూడా టారీఫ్‌లతో చంపుతోంది' అని స్కాట్ జెన్నింగ్స్ రేడియో షోకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మండిపడ్డారు. ప్రపంచంలోని ఏ మానవుడికన్నా తనకు సుంకాలు బాగా తెలుసని, అమెరికా న్యూఢిల్లీపై టారీఫ్‌లు విధించడం మొదలుపెట్టిన తర్వాతే భారత్ సుంకాలను తగ్గించడం ప్రారంభించింది. భారత్‌ను అత్యధిక సుంకాలు విధించే దేశంగా ముద్రవేసిన ట్రంప్.. మీకు తెలుసా, వాళ్లు నాకు ఇకపై ఎటువంటి సుంకాలు విధించబోమని చెప్పారు ' అని పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఇలాంటి ఆరోపణలు చేయడం ఇదే మొదటిసారి కాదు. భారత్- అమెరికా మధ్య వ్యాపార సంబంధాలు పూర్తిగా ఓవైపునే ఉన్నాయని ట్రంప్ సోమవారం వ్యాఖ్యానించారు. 'ఇది ఓవైపు విధ్వంసం.. ఇప్పుడేమో సుంకాలు తగ్గిస్తామని ఆఫర్ ఇచ్చింది... కానీ, ఇప్పటికే ఆలస్యమైంది' అని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.కాగా, అమెరికా అప్పీళ్ల కోర్టు టారీఫ్‌లు 'చట్టవిరుద్ధం' అని తీర్పు ఇవ్వడంతో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ తీర్పుపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా సుంకాలను తొలగించాలని అప్పీల్ కోర్టు తప్పుగా చెప్పింది.. కానీ చివరికి అమెరికా గెలుస్తుందని వారికి తెలుసు' అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో విమర్శించారు. ఇక, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. ప్రపంచంలోనే అత్యధికంగా బ్రెజిల్ తర్వాత భారత్‌పైనే టారీఫ్‌లు విధించడం గమనార్హం., రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందని ఆరోపిస్తూ అదనపు సుంకాలు ట్రంప్ విధించారు. అయితే, అమెరికా విధించిన సుంకాలను అన్యాయమైనవి,

## నెల రోజుల్లో రూ.5.90 లక్షలు ఖర్చు చేసిన జంట.. వీడియో వైరల్, నెటిజన్లు షాక్



**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా ఒక భార్యాభర్తల జంట.. ఒక నగరంలో జీవించాలంటే నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు ఖర్చు అవుతుంది. అదే వారు బెంగళూరు లాంటి మెట్రో సిటీలో బతకాలంటే ఇంకో రూ.10 వేల నుంచి రూ.20 వేలు అదనంగా అవసరం అవుతాయి. ఎందుకంటే ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసరాలు, లగ్జరీలు, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ఖర్చులు చేస్తుంటే.. నెలవారీ బడ్జెట్ భారీగా పెరిగిపోతూనే ఉంటోంది. అయితే.. ఇప్పుడు చెప్పబోయే జంట మాత్రం.. ఒకే నెలలో లక్షల రూపాయలు ఖర్చు చేసింది. ఆ విషయాన్ని స్వయంగా ఆ భార్యాభర్తలే వెల్లడించారు. నెల రోజుల్లో తాము దేనికి ఎంత ఖర్చు చేశామో చెబుతూ.. ఒక వీడియోను కూడా విడుదల చేశారు. మొత్తంగా ఒక నెల రోజుల్లో ఏకంగా రూ.5.90 లక్షలు ఖర్చు పెట్టినట్లు స్పష్టం చేశారు.కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో నివసించే ఓ జంట.. ఆగస్ట్ నెలలో తాము ఖర్చు చేసిన వివరాలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇప్పుడు ఆ వీడియో తెగ వైరల్ అవుతోంది. ప్రకృతి అరోరా, ఆశిష్ అనే జంట కలిసి మొత్తం నెల రోజుల్లో రూ. 5.90 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పడంతో నెటిజన్లు ఆశ్చర్యంలో మునిగిపోతున్నారు. వీరిద్దరూ.. ' ట్రావెల్ కపుల్ ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో తమ ఒక అకౌంట్‌ను మెయింటైన్ చేస్తున్నారు. వారు తమ లైఫ్ స్టైల్, టూర్ల విశేషాలు, అనుభవాలను.. ఎప్పటికప్పుడు ఆ ఇన్‌స్టాగ్రామ్ పేజీలో అప్‌డేట్లు ఇస్తూనే ఉంటారు.అయితే ఆగస్ట్ నెలలో ఈ రూ.5.90 లక్షలను ఎలాంటి వాటికి ఖర్చు చేశాం అనే పూర్తి వివరాలను ఆ జంట వీడియోలో వివరించారు. వీళ్లిద్దరూ ట్రావెల్, లైఫ్ స్టైల్‌కు సంబంధించిన వీడియోలు చేస్తూ.. కంటెంట్ క్రియేటర్లుగా పనిచేస్తున్నారు. ఈ జంటకు ఇన్‌స్టాగ్రామ్‌లో 3.78 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.

## కర్ణాటక కాంగ్రెస్‌లో ఫిరాయింపు ముసలం



**బెంగళూరు - నవభూమి:** కర్ణాటక కాంగ్రెస్ ఫిరాయింపు రాగం అందు కున్నది. సీఎం, డిప్యూటీసీఎం వర్గాలుగా చీలిన నేతలు.. ఫిరాయింపుల పాట పాడుతున్నారు. బీజేపీలోకి మీరు వెళ్లిపోతారంటే.. లేదు మీరే వెళ్లిపోతారంటూ పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్నారు.

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లోఅంతర్గత విభేదాలు మరోమారు భగ్గుమన్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గీయుల మధ్య మాటల తూటాలు మళ్లీ పేలుతున్నాయి. సిద్ధరామయ్య మద్దతుదారుడైన సీనియర్ ఎమ్మెల్యే కేఎన్ రాజన్నను మంత్రివర్గం నుంచి తొలగించడం ఇద్దరు అగ్రనేతల మద్దతుదారుల మధ్య చిచ్చు రేపింది. డీకే శివకుమార్‌పై రాజన్న మద్దతుదారులు విరుచుకుపడుతున్నారు. రాజన్నను మంత్రి పదవి నుంచి తొలగించడం వెనక డీకే పన్నాగం ఉందని ఆరోపిస్తున్నారు.కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలను బహిరంగంగా ప్రశ్నించిన తర్వాత రాజన్న మంత్రి పదవి నుంచి ఉద్వాసనకు గురవడం వివాదానికి కారణమైంది. తాజాగా డీకేకు అత్యంత సన్నిహితుడైన ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ, రాజన్న కుమారుడు అయిన రాజేంద్ర మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరడంతో పార్టీలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. తాజాగా రాజేంద్ర మాట్లాడుతూ సెప్టెంబర్ విప్లవం గురించి మాట్లాడుతున్న వారంతా చివరికి బీజేపీలో చేరుతారని వ్యాఖ్యానించారు.రాజన్నను నిందిస్తున్న వారంతా బీజేపీలోకి వెళ్తారని, అది చూసి మనం ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాల్ 20-25 మంది ఎమ్మెల్యేలను బీజేపీలోకి తీసుకొస్తామని చెప్తున్నారని, అదే జరిగితే సెప్టెంబర్ విప్లవం గురించి చెప్పిన మాటలు నిజమవుతాయని అన్నారు. సెప్టెంబర్‌లో ఏం కావాలనుకుంటే అది చేసుకోవచ్చని, అవసరమైతే బ్రెయిన్ మ్యాపింగ్ కూడా చేయించుకోవచ్చని, ఇప్పటికే కొంతమంది పార్టీ నుంచి ఒక కాలు బయట పెట్టారని డీకేను ఉద్దేశించి అన్నారు. అలాగే రాజన్న అసెంబ్లీలో ఆరెస్సెస్ గీతం పాడలేదని, ఆరెస్సెస్ క్యాంపునకు వెళ్లేందుకు షార్ట్ ధరించలేదని పరోక్షంగా డీకేకి చురకలంటించారు.

ఆయన మాటలే ఆయన్ను నాశనం చేశాయి

రాజేంద్ర వ్యాఖ్యలపై బాలకృష్ణ దీటుగా బదులిచ్చారు. రాజన్న మంత్రిగా ఉన్నప్పుడు ప్రవర్తించిన తీరు, నడవడిక, భాషే ఆయనను నాశనం చేశాయని విమర్శించారు. 'మాట ఒక కుటుంబాన్ని నాశనం చేస్తుంది, ఒక రంధ్రం పొయ్యిని పాడు చేస్తుంది' అనే సామెత ఆయనకు సరిపోతుందని ఎద్దేవా చేశారు. ఆయన ఇప్పటికే బీజేపీకి దరఖాస్తు చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, రాజన్న ప్రకటనపై అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## జీఎస్టీ భారం తగ్గింపు.. ఎట్టకేలకు రాహుల్ గాంధీ సలహా పాటించారన్న కాంగ్రెస్ నేత



**న్యూఢిల్లీ-నవభూమి:** సెప్టెంబర్ 3, బుధవారం నాడు జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ఉన్న నాలుగు శ్లాబ్‌లలో రెండింటిని అనగా 12, 28 శాతం శ్లాబ్‌లను తొలగించారు. ఇక మీదట కేవలం 5, 18 శాతం శ్లాబ్‌లు మాత్రమే కొనసాగుతాయని తెలిపారు. కేంద్రం నిర్ణయం వల్ల నిత్యవసరాల ధరలు భారీగా దిగి వస్తాయని అంటున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం నిర్ణయంపై కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా తీవ్ర విమర్శలు చేశారు. 8 సంవత్సరాల తర్వాత జీఎస్టీ సంస్కరణలు తీసుకురావడంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఈక్రమంలో పవన్ ఖేరా జీఎస్టీ రేట్ల తగ్గింపు అంశంపై స్పందిస్తూ.. ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు గురించి రాహుల్ గాంధీ ఏనాడో చెప్పారని.. ఆయన సలహా పాటించడానికి కేంద్ర ప్రభుత్వం ఇంత సమయం ఎందుకు తీసుకుందని ఆయన ప్రశ్నించారు. ఎట్టకేలకు.. చివరకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ భారం తగ్గింపు అంశంలో రాహుల్ గాంధీ సలహా పాటించిందని తెలిపారు. దీనితో పాటు గతంలో రాహుల్ గాంధీ జీఎస్టీ అంశంపై చేసిన స్క్రీన్ షాట్లను కూడా షేర్ చేశారు.జీఎస్టీ అంశంపై రాహుల్ గాంధీ గతంలో మాట్లాడుతూ.. పరోక్ష పన్నులు పేద, ధనిక అనే తేడా లేకుండా అందరిపై ప్రభావం చూపుతాయని తెలిపారు. అందుకే జీఎస్టీ మండలి పన్ను రేటును 18 శాతం లేదా అంతకంటే తక్కువగా ఉంచాలని రాహుల్ గాంధీ గతంలోనే కోరారు. దీనివల్ల పేద ప్రజలపై ఎక్కువ భారం పడకుండా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా రాహుల్ గాంధీని జీఎస్టీని ఉద్దేశించి గబ్బర్ సింగ్ టాక్స్ అని అనేక సార్లు విమర్శించిన సంగతి తెలిసిందే.ప్రధానమంత్రి మోదీ ఈ సంవత్సరం ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జీఎస్టీలో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించారు. జీఎస్టీ విధానాన్ని సరళీకృతం చేస్తామని ఆయన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. మాట ఇచ్చినట్లుగానే ప్రస్తుతం జీఎస్టీ శ్లాబులను సవరించారు. దీనిపై జనాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త జీఎస్టీ రేట్లు ఈ నెల అనగా సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయి.జీఎస్టీ భారం తగ్గింపుతో కేంద్ర ప్రభుత్వం దిగువ, మధ్యతరగతి జనాలకు భారీ శుభవార్త చెప్పింది. దీపావళి కన్నా ముందే పండగలాంటి వార్త చెప్పి వారికి ఊరట కలిగించింది. కేంద్రం ప్రభుత్వం జీఎస్టీలో కీలక సంస్కరణలు చేపట్టి.. పన్ను రేట్లను తగ్గించింది. దసరా పండగలోపే కొత్త జీఎస్టీ రేట్లను అమలులోకి తెస్తోంది. జీఎస్టీలో ప్రస్తుతం అమలులో ఉన్న 12, 28 తొలగించి.. 5, 18 శ్లాబులను మాత్రమే కొనసాగించబోతున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.అయితే జీఎస్టీ భారం తగ్గించి.. సామాన్యులకు ఊరట కల్పించిన ప్రభుత్వం.. కొత్తగా 40 శాతం శ్లాబు ప్రతిపాదించి ప్రీమియం వస్తువుల వినియోగదారులకు ఊహించని షాకిచ్చింది. అయితే కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన ఈ 40 శాతం శ్లాబు సామాన్యులు, మధ్యతరగతి వారిపై ఎలాంటి ప్రభావం చూపదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

## తేల్చిచెప్పేశారు.. విదేశీ మత ప్రచారాలు నిషిద్ధం..



**బెంగళూరు - నవభూమి:** బెంగళూరు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఈనెల 5, 6 తేదీలలో జరిగే అంతర్జాతీయ మిలాద్-ఉన్-నబి సమ్మేళనంలో విదేశీ ధర్మగురువులు భారత్‌లో ధార్మిక కార్యక్రమాలలో భాగస్వామ్యం వహించడం, మత ప్రచారాలు చేయడం నిషేధంగా ఉందని హోం మంత్రి పరమేశ్వర్ స్పష్టత ఇచ్చారు. గురువారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్యాలెస్ మైదానంలో మిలాద్-ఉన్-నబి సమ్మేళనానికి భారత గ్రాండ్ ముక్తిషేక్ అబూబకర్ అహ్మద్ ముస్లియార్‌తోపాటు యెమెన్ సూఫీసంత్ హబీబ్ ఉమర్‌లను ఆహ్వానించారు.ఈ మేరకు విదేశీ ధర్మగురువులు ఇక్కడ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించరాదని, ఇది వీసా నియమాలకు ఉల్లంఘన కానుందని నిర్వాహకులకు సూచించామన్నారు. భారతదేశ చట్టాలకు అనుగుణంగా విదేశీ ధర్మ గురువులు ప్రచారాలు చేయరాదన్నారు. వారిని ఆహ్వానించి ఉండవచ్చునని, నిబంధనలు ఉల్లంఘించేలా వ్యవహరించరాదన్నారు. విదేశీ ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం (ఎఫ్ఆర్ఆర్ఓ) కార్యక్రమాన్ని పర్యవేక్షించనుందన్నారు.

## పంజాబ్ అతలాకుతలం



**జమ్ము - నవభూమి:** హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లో భారీగా వానలు పడటంతో సట్లెజ్, బియాస్, రావి వంటి నదులు పొంగిపొర్లడంతో పంజాబ్‌లో 1,655 గ్రామాలపై వరద ప్రభావం పడింది. 1.48 లక్షల హెక్టార్లలో పంట నాశనమైంది. లక్షలాది ఎకరాలు 8 నుంచి 10 అడుగుల నీటిలో మునిగాయి. వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక గ్రామాలు వరద నీటిలో మునిగాయి. వరద నీటిలో చిక్కుకున్న వారిని పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పలు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

## సీఏఏపై కేంద్రం కీలక నిర్ణయం.. పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్ మైనార్టీలకు భారీ ఊరట



**పాకిస్తాన్ - నవభూమి:** పాకిస్తాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ వంటి ముస్లిం దేశాల్లో మతపరమైన హింసను ఎదుర్కొని.. ప్రాణాలు అరచేత పట్టుకుని.. భారత్‌లోకి వలస వచ్చిన మైనారిటీలకు కేంద్ర హోంశాఖ భారీ ఊరట కల్పించింది. ఈ 3 దేశాల్లో హింసను తప్పించుకుని.. భారత్‌లోకి వచ్చిన మైనారిటీ వర్గాలైన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు, క్రైస్తవులకు ఉపశమనం ఇచ్చింది. పాస్‌పోర్ట్ లేదా ఇతర ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండానే భారతదేశంలో ఉండేందుకు అనుమతి ఇస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అయితే మొదట 2014 డిసెంబర్ 31వ తేదీ నాటికి భారత్‌లో అడుగు పెట్టిన వారికి మాత్రమే.. భారత పౌరసత్వం ఇస్తామని.. గతేడాది అమల్లోకి వచ్చిన పౌరసత్వ (సవరణ) చట్టం 2024లో పేర్కొన్నారు. కానీ తాజాగా ఈ చట్టంలోని నిబంధనలను కాస్త సడలిస్తూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2024 డిసెంబర్ 31వ తేదీ వరకు అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల నుంచి భారత్‌లోకి వచ్చిన ముస్లిమేతర మైనారిటీలకు ఈ నిబంధనలు వర్తిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. గతేడాది అమల్లోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం.. 2014 డిసెంబర్ 31వ తేదీ లేదా అంతకుముందు మన దేశంలోకి వచ్చిన మైనారిటీలందరికీ భారత పౌరసత్వం లభిస్తుంది. ఇమ్మిగ్రేషన్, విదేశీయుల చట్టం 2025 కింద తాజా ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో 2014 తర్వాత భారత్‌కు వలస వచ్చిన ఈ 3 దేశాల ముస్లిమేతర మైనారిటీలకు.. మరీ ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి వచ్చిన హిందువులకు ఉపశమనం కలగనుంది. వీరందరికీ పాస్‌పోర్ట్, వీసా కలిగి ఉండాలనే నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందని హోం మంత్రిత్వ శాఖ ఆ ఉత్తర్వుల్లో వెల్లడించింది.తాజా నిర్ణయంతో 2024 డిసెంబర్ 31 లోపు భారత్‌లోకి వలస వచ్చిన శరణార్థులకు పౌరసత్వం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అధికారిక గుర్తింపు పత్రాలు లేకున్నా.. వారంతా భారత్‌లో నివసించవచ్చని తెలిపింది. ఈ నిర్ణయంతో అలాంటివారికి న్యాయపరంగా ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోతాయి. ఈ నిర్ణయంతో గత కొన్ని దశాబ్దాలుగా భారత్‌లో కాందిశీకుల్లా నివసిస్తున్న వారు గౌరవంగా జీవించవచ్చని.. వారు దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా రాకపోకలు సాగించవచ్చని.. ఆస్తులు కూడా కొనుగోలు చేయవచ్చని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది.పాకిస్తాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వలస వచ్చిన శరణార్థులకు పత్రాలు లేకపోయినా.. వెంటనే పౌరసత్వం ఇచ్చేలా పౌరసత్వ సవరణ చట్టం-2019ని గతేడాది కేంద్రం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ సీఏఏ-2019 చట్టం ప్రకారం.. ఈ 3 దేశాల నుంచి వచ్చిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

## బీజేపీ రాష్ట్ర చీఫ్ సంచలన కామెంట్స్..

**చెన్నై- నవభూమి:** కేంద్రప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను డీఎంకే ప్రభుత్వం నీరుగారుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్‌ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దిండుగల్ జిల్లా పళని ప్రాంతంలోని ఫుట్‌పాత్ వ్యాపారులు, చిన్నా, మధ్యతరగతి కార్మికులను ఆదుకునేలా కేంద్రప్రభుత్వం పరిచయం చేసిన స్వానిధి, ముద్రా రుణాలు అందజేసేలా దిండుగల్ జిల్లా బీజేపీక కార్యదర్శి పరమేశ్వరిని స్థానిక డీఎంకే పంచాయతీ చైర్మెన్ ఉమా మహేశ్వరి అసభ్య పదజాలంతో ధూషించారని,దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చూపారని ఆరోపించారు. ప్రజలకు లబ్దిచేకూర్చే కేంద్రప్రభుత్వ పథకాలకు ప్రజలనుండి మంచి స్పందన వస్తుండటాన్ని చూసి ఓర్వలేక డీఎంకే ప్రభుత్వం పథకాలను అడ్డుకుంటోందని, మరోవైపు కేంద్రప్రభుత్వ పథకాలకు స్టిక్కర్లు అంటించి తమ పథకాలుగా ప్రకటించుకుంటోందని విమర్శించారు. డీఎంకే-కాంగ్రెస్ కూటమిలోని పార్టీలన్నీ ఏకమై కేంద్రప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నా.. ప్రధాని నరేంద్రమోదీ మాత్రం వాటిని పట్టించుకోకుండా తమిళనాడు ప్రజలకు లబ్దిచేకూర్చే విధంగా పథకాలు అమలుచేస్తున్నారని, దీనిపై రాష్ట్రబీజేపీ తరుపున ప్రచారం చేపట్టనున్నట్లు నయినార్ నాగేంద్రన్ తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 | హైదరాబాద్
శుక్రవారం
05 । సెప్టెంబర్ । 2025







## కళ్లు చెదిరే కాంతల్లా

వేడుకల్లో వెలిగిపోయేలా బంగారు, వెండి జరీ ధగధగలు, కలనేతల కళాకాంతులు సొంతం చేసుకోవాలనుకునే వారి కోసం పలు రకాల పట్టు చీరలు ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిలో కొన్నిటి మీద ఓ లుక్కేద్దామా? చామంతులు, కనకాంబరాలు కలిపి కట్టిన పూమాలలా కనిపించాలంటే పవిట చెంగు, కుచ్చిళ్లు ఒక రంగు లో, చీర మొత్తం మరో రంగులో ఉండాలి. అలాంటి కాంట్రాస్ట్ రంగుల్లోనే చీర భారీగా కనిపించి కనువిందు చేస్తుంది. తెల్ల పట్టుచీర హుందాతనమే వేరు. ప్రింటెడ్ డిజైన్ మోడర్న్ లుక్‌ని తెచ్చిపెడితే, కాంట్రాస్ట్ జరీ బార్డరు చీర మొత్తానికే వన్నె తెస్తుంది. వెండి వెలుగులు విరజిమ్మాలంటే వెండి జరీలో ధగధగలాడాలి. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే వెండి జరీ చీరను ఎంచుకుంటే సరి! కుచ్చిళ్ల దగ్గర జరీ బార్డరు మోకాళ్ల వరకూ ఉండడం తాజా ఫ్యాషన్! ఈ స్టయిల్ చీరకు వినూత్న ఆకర్షణను తెచ్చిపెడుతుంది. జరీ మీద కనిపించీ, కనిపించకుండా ఉండే సెల్ఫ్ డిజైన్ చీరకే వన్నె తెస్తుంది.

# యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్



**యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్**

బరువు తగ్గడం పెద్ద సమస్యగా మారిపోయింది. డైటింగ్, వ్యాయామం... ఏం చేసినా అధిక బరువు తగ్గకపోతే, అందుకు శరీరంలోని 'ఇన్‌ఫ్లమేషన్'ను అనుమానించాలి. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో ఇన్‌ఫ్లమేషన్ కూడా స్థూలకాయానికి కారణమవుతుంది దీన్ని వదిలించుకోవడం కోసం 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్'ను ఎంచుకోవాలి.

ప్రతి రోజూ ఇవి తప్పనిసరి
ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు
విటమిన్ డి
ప్రొబయాటిక్స్ (పెరుగు, మజ్జిగ)
పసుపు (రోజుకు ఒకటి నుంచి రెండు టీస్పూన్లు)
అల్లం (రోజుకు 250 నుంచి 500 మిల్లీ గ్రాములు)

ప్రత్యామ్నాయాలున్నాయి
తీపి కోసం: చక్కెరకు బదులుగా ముడి బెల్లం, తేనె, ఖర్జూరాలు
తెల్ల బియ్యం: బ్రౌన్ రైస్, మిల్లెట్స్
రిఫైన్డ్ నూనెలు: గానుగ నూనెలు, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్
మైదా: పాలిష్ పట్టని గోధుమ పిండి

కొన్ని ఆరోగ్య సమస్యలకు ప్రత్యేకమైన వైద్య చికిత్సలంటూ ఉండవు. మరీముఖ్యంగా జీవనశైలితో ముడిపడి ఉండే ఒబేసిటీకి ఆహారమే ఔషధం. కొంతమంది ఎంత వ్యాయామం చేసినా, ఎంత మితంగా తింటున్నా అధిక బరువును వదిలించుకోలేకపోతూ ఉంటారు. ఈ కోవకు చెందిన ఊబకాయులు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌ను అనుసరించాలి. కొత్తగా, ఫ్యాషన్‌గా, ట్రెండీగా ఉండే పదార్థాలకు స్వస్థి చెప్పి, మన పూర్వీకుల నుంచి వస్తున్న భోజనశైలిని అనుసరించాలి.



పరిష్కారం మన మూలాల్లోనే...

ఏరోమ్యాటిక్ ఆర్థ్రయిటిస్, యూరిక్ యాసిడ్ సంబంధిత ఆర్థ్రయిటిస్... ఈ సమస్యలతో బాధపడుతున్నవాళ్లు, ఎంతకూ బరువు తగ్గనివాళ్లు, కండరాల నొప్పులు, ఎముకల నొప్పులు, బలహీనత మొదలైన లక్షణాలతో బాధపడేవాళ్లు తప్పనిసరిగా శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను అనుమానించాలి. నిజానికి ఈ సమస్యలకు అసలు కారణాన్ని కనిపెట్టలేక రకరకాల మందులు వాడుకుంటూ ఆరోగ్యాన్ని కుదేలు చేసుకునే వాళ్లూ ఉంటారు. కానీ మూల కారణాన్ని సరిదిద్దుకుంటే ఈ ఇబ్బందులు వాటంతట అవే తొలగిపోతాయి. అందుకోసం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారాన్ని ఎంచుకోవాలి. పాలిష్ పట్టని ముడి పదార్థాల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. నొప్పి, వాపులను తగ్గించే పోషకాలు మన స్థానిక పంటల్లో ఉన్నాయి.

ఇన్‌ఫ్లమేషన్ పరీక్షలు ఇవే!

మన సమస్యలకు కారణం ఇన్‌ఫ్లమేషన్ అవునో, కాదో తెలుసుకోవడం కోసం, ఇన్‌ఫ్లమేషన్ తీవ్రతను పసిగట్టడం కోసం ఇన్‌ఫ్లమేటరీ మార్కర్స్‌ను పరీక్షించాలి. అందుకోసం 'సి రియాక్టివ్ ప్రొటీన్ ఐఎల్6'ను పరీక్షిస్తే, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ మోతాదు తెలిసిపోతుంది. మోతాదును బట్టి ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్ తీసుకోవడంతో పాటు, ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రేరేపించే పదార్థాలను పూర్తిగా మానేయాలి.

ఇన్‌ఫ్లమేషన్ ఎందుకు?

ఇటీవలి కాలంలో మన ఆహారంలో ప్రాసెస్ చేసిన పదార్థాల మోతాదు పెరిగింది. తెల్ల బియ్యం, గోధుమలు, మైదా, వంటనూనెలు, చక్కెర ఇవన్నీ ప్రాసెస్ చేసినవే! వీటితో తయారయ్యే బిర్యానీలు, రొట్టెలు, బ్రెడ్లు, స్వీట్స్, కేక్స్, పిజ్జా వంటి ఆహార పదార్థాలన్నీ ఇన్‌ఫ్లమేషన్ కారకాలే! ఇంతకు ముందు ఈ సమస్య ఉండేది కాదు. ఇంట్లో తయారు చేసుకునే వంటకాల్లో దంపుడు బియ్యం, పొట్టు తీయని కందిపప్పు, పెసరపప్పు, పసుపు, వెల్లుల్లి వాడుకుంటూ ఉండేవాళ్లం. కానీ ఇప్పుడు మనం తింటున్న ఆహారంలో 80% ప్రాసెస్ చేసిన పదార్థాలే ఉంటున్నాయి. ప్రాసెస్డ్ మీట్, రిఫైన్డ్ షుగర్స్, రిఫైన్డ్ ఆయిల్స్, ఎక్కువ ఉప్పు, తీపి, నూనెలు కలిసిన పదార్థాలు, డీప్ ఫ్రై పదార్థాలు ఎక్కువగా తింటున్నాం. వీటి వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ మొదలై, వాపులు, నొప్పుల రూపంలో బయటపడుతూ ఉంటుంది. ఇన్‌ఫ్లమేషన్ మూలంగా కార్డియో వ్యాస్క్యులర్ సమస్యలు కూడా పెరుగుతాయి. జీర్ణ వ్యవస్థ ఇబ్బందులకు లోనవుతుంది. చర్మ సమస్యలు పెరుగుతాయి.

వీటి మోతాదు పెంచాలి
ఒమేగా3 పుష్కలంగా ఉండే సాల్మన్, మ్యాకెరల్ చేపలు
ఆకుకూరలు వాల్‌నట్స్, బాదం
షియా సీడ్స్, గుమ్మడి విత్తనాలు, అవిసె గింజలు
యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే దానిమ్మ, బెర్రీ, సిట్రస్ పండ్లు
పసుపు, దాల్చినచెక్క, వెల్లుల్లి, అల్లం
బ్రౌన్ రైస్, మిల్లెట్స్, హోల్ వీట్ ఆటా, దంపుడు బియ్యం
సెనగలు, బొబ్బర్లు, అలసందలు
పెరుగు, మజ్జిగ
కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్, గానుగ నూనెలు, బెల్లం,
దంపుడు బియ్యం
ప్రతి రోజూ 5 నుంచి 7 రకాల కూరగాయలు,
పండ్లు తినాలి
వంటకాల్లో పసుపు, దాల్చినచెక్క, అల్లం ఎక్కువగా వాడాలి

ఇవి వద్దే వద్దు
హాట్ డాగ్, సాసేజ్, బేకన్ లాంటి ప్రాసెస్డ్ మీట్స్
తెల్లని చక్కెర, హై ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ లాంటి
రిఫైన్డ్ షుగర్స్
లాక్టోజ్ ఇంటాలరెన్స్ కలిగి ఉండేవాళ్లు పాల
ఉత్పత్తులు తీసుకోకూడదు
సోడియం ఎక్కువగా ఉండే ప్రాసెస్డ్, క్యాన్డ్ ఫుడ్స్
పిజ్జాలు, బర్గర్లు లాంటి బేక్ చేసిన స్నాక్స్, పదార్థాలు
శీతల పానీయాలు
గ్లూటెన్ పడనివాళ్లు గోధుమలు, మైదాలతో తయారయ్యే పదార్థాలకు దూరంగా ఉండాలి

విటమిన్ డి లోపంతో...

ఇన్‌ఫ్లమేషన్‌కు మరొక ప్రధాన కారణం విటమిన్ డి లోపం. కాబట్టి ప్రతి ఒక్కరూ విటమిన్ డి మోతాదును పరీక్షించుకుని, అవసరం మేరకు సప్లిమెంట్ల రూపంలో ఈ విటమిన్ భర్తీ చేసుకుంటూ ఉండాలి. మనం ప్రధానంగా నిర్లక్ష్యం చేసే మరొక మినరల్ మెగ్నీషియం. ఈ లోపాన్ని భర్తీ చేసుకోవడం కోసం గుమ్మడి విత్తనాలు, పుచ్చ విత్తనాలు తీసుకోవాలి.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌తో...

ఈ డైట్‌తో ఒబేసిటీ అదుపులోకి రావడంతో పాటు మరెన్నో ఆరోగ్యపరమైన ప్రయోజనా లుంటాయి. అవేంటంటే...

తీవ్ర రుగ్మతలు:
గుండె జబ్బులు, కేన్సర్లు, ఆటో ఇమ్యూన్ ముప్పులు తగ్గుతాయి
ఇమ్యూనిటీతో పాటు, చర్మ ఆరోగ్యం, శక్తి మోతాదులు కూడా పెరుగుతాయి
క్యాలరీలు తక్కువ, పీచు ఎక్కువ కాబట్టి బరువు తగ్గుతారు

# మీకు జంక్‌ఫుడ్ అలవాటైందా..
# అందులోంచి ఇలా బయటపడండి!





టీవీ చూస్తూ చిప్స్.. మూవీకెళ్తే ఫ్రెంచ్‌ఫ్రైస్.. సండే వస్తే బర్గర్.. పండుగొస్తే పిజ్జా.. ఇలా జంక్‌ఫుడ్ జంక్షన్‌లో ఈ తరం చిక్కుకుపోయింది. మళ్లీ మళ్లీ తినాలనిపించే జంక్‌ఫుడ్.. ఊబకాయానికి దారితీస్తుంది. అనారోగ్యానికి బాటలు పరుస్తుంది. వీటి తయారీలో ఉపయోగించే కొవ్వులు జీర్ణశక్తిని మందగించేలా చేస్తాయి. జంక్‌ఫుడ్ అలవాటైతే అందులోంచి బయటపడటం అంత తేలిక కాదు! హాని కలిగించే ఈ చిరుతిళ్లు మానడానికి ఈ సూత్రాలు పాటించండి..

జంక్‌ఫుడ్ మానాలనుకున్నప్పుడు మొదట మీ ఆహారంలో ఎక్కువ పోషకాలు ఉండే పదార్థాలను చేర్చుకోవాలి. ఇంట్లోనే బెల్లం ఉండలు, చెగోడీలు లాంటి చిరుతిళ్లు తయారు చేసి అందుబాటులో ఉంచడం మంచిది.

పిల్లలకు భోజనం మొక్కుబడిగా కాకుండా ఆస్వాదిస్తూ తినడం అలవాటు చేయండి. వారి ఆకలి వేళలకు తగ్గట్టుగా ఇష్టమైన ఆహార పదార్థాలను సిద్ధం చేయండి.

ఆరోగ్యవంతమైన ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి అప్పుడప్పుడూ చెబుతూ ఉండాలి. అడపాదడపా వారికి ఇష్టమైన వెరైటీలను బయట తినిపించొచ్చు.

పిల్లలు ఇష్టంగా తింటున్న జంక్‌ఫుడ్ ఏంటో గుర్తించి ఆ వెరైటీని ఇంట్లోనే చేయండి. ఇలా చేస్తే అనవసరమైన కొవ్వు, నిల్వ రసాయనాల ముప్పు నుంచి మీ చిన్నారులను తప్పించవచ్చు.

# వానల్లో మొక్కల సంరక్షణ



మనం సాధారణంగా బాల్కనీలో, ఇంటి పరిసరాల్లో మొక్కల కుండీలను ఏర్పాటు చేసుకుంటూ ఉంటాం. వర్షాకాలంలో ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. కానీ ఒక్కోసారి ఆకులు పసుపు రంగులోకి మారడం, కాండానికి ఫంగస్ రావడం, వేళ్లు కుళ్లిపోయి మొక్కలు వడలిపోవడం లాంటివి గమనిస్తూ ఉంటాం. అలాకాకుండా మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే వర్షాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

నీళ్లు ఎక్కువగా అవసరంలేని మొక్కల కుండీలకు వర్షం తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వీటి మీద గ్రీన్ నెట్ అమర్చడం మంచిది.

వర్షాకాలంలో కుండీలను ముప్పావు వంతుకు పైగా మట్టితో నింపాలి. దీనివల్ల వర్షపు నీరు ఎక్కువగా కుండీల్లో నిలవకుండా ఉంటుంది.

కుండీల్లో మట్టి మరీ మెత్తగా ఉంటే అది ఎక్కువగా నీటిని పీల్చుకుంటుంది. దీనివల్ల వర్షాకాలంలో మొక్కలు త్వరగా పాడవుతాయి. అలాంటప్పుడు ఈ మెత్తని మట్టిలో కొద్దిగా ఇసుకను కలిపితే అదనపు నీరు త్వరగా బయటికి వెళుతుంది.

కుండీ అడుగు భాగంలో ఉండే రంధ్రాలను గమనించాలి. కుండీలో చేరిన అదనపు నీరు బయటికి వస్తుందో లేదో పరిశీలించాలి. రంధ్రాల వద్ద వేళ్లు లేదా మట్టి చేరి నీళ్లు బయటికి పోకుండా అడ్డుపడుతుంటాయి. వీటిని ఎప్పటికప్పుడు సరిచేస్తూ ఉండాలి.

వర్షాకాలంలో కుండీల కింద పళ్లాలు ఉంచకూడదు. అలా ఉంచితే మొక్కల వేళ్లు కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. చిన్న కాళ్లు ఉన్న కుండీలను ఎంచుకోవడం మంచిది. అలా లేని పక్షంలో కుండీ కింద నాలుగు వైపులా చదునుగా ఉన్న రాళ్లు అమర్చాలి. అప్పుడు కుండీలో చేరే వర్షపు నీరు సులువుగా బయటికి వెళుతుంది.

వర్షాకాలంలో గాలులు బలంగా వీస్తుంటాయి. వీటి ధాటికి కుండీల్లోని మొక్కలు వంగిపోవచ్చు. ఒక్కోసారి వేళ్లతో సహా ఒరిగిపోవచ్చు. అలాకాకుండా మొక్కలన్నింటికీ ఆధారంగా కర్రలను కుండీల్లో నిలబెట్టాలి.

కాండానికి కింది భాగంలో ఉన్న ఆకులకు తేమ ఎక్కువగా తగులుతూ ఉంటుంది. దీనివల్ల మొక్కకు ఫంగస్ చేరవచ్చు. కాబట్టి కుండీలో మట్టికి దగ్గరగా ఉండే ఆకులను కత్తిరించడం మంచిది.

# నవ బిజినెస్




## సూచీలకు లాభాల జోష్.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

**ముంబై-నవభూమి:**జీఎస్టీ సంస్కరణలు దేశీయ సూచీలకు మంచి బూస్టింగ్ ఇస్తున్నాయి. గత వారం నష్టాలను చవిచూసిన సూచీలు ఈ వారం లాభాల్లో చలిస్తున్నాయి. జీఎస్టీ నూతన సంస్కరణలు మదుపర్లలో విశ్వాసాన్ని కలిగించడంతో సూచీలు భారీగా లాభపడుతున్నాయి. జీఎస్టీ శ్లాబుల్లో మార్పులు దేశ అభివృద్ధికి సహకరిస్తాయని విశ్లేషణలు వస్తున్నాయి. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో కొనసాగుతున్నాయి బుధవారం ముగింపు (80, 567)తో పోల్చుకుంటే గురువారం ఉదయం భారీ లాభాలతో మొదలైన సెన్సెక్స్ ఆ ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. గురువారం ఉదయం దాదాపు 900 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ ప్రారంభమైంది. దాదాపు అన్ని రంగాలు లాభాలను ఆర్జిస్తున్నాయి. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 457 పాయింట్ల లాభంతో 81, 024




వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 138 పాయింట్ల లాభంతో 24, 853 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో ఎమ్ అండ్ ఎమ్, బజాజ్ ఫైనాన్స్, బ్రిటానియా, కోల్గేట్, పీబీ ఫిన్‌టెక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. పేటీఎమ్, కల్యాణ్ జువెల్లర్స్, పిరామిల్ ఫార్మా, కోఫోర్జ్ లిమిటెడ్, సెయిల్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 152 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 175 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది.

## బిగ్ దివాళీ గిఫ్ట్.. కొత్త జీఎస్టీ రేట్లపై హర్ష్ గోయెంకా పోస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:**కొత్త వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ జీఎస్టీలో కీలక సంస్కరణలు చేపట్టింది ప్రభుత్వ నిర్ణయంపై పలువురు రాజకీయ, వ్యాపార వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బిగ్ దివాళీ గిఫ్ట్ అంటూ సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని మోదీ ప్రకటించిన దీపావళి కానుక అద్భుతంగా ఉందంటూ దిగ్గజ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా కితాబిస్తున్నారు.

## వారసత్వ వ్యాపారం సొంతం చేసుకునే అవకాశాన్ని అందిస్తున్న బరోడా పరిబాస్ బిజినెస్ కాంగ్లోమరేట్స్ ఫండ్

**న్యూఢిల్లీ-నవభూమి:**'ప్రతి భారతీయుడికి ఇది అతిపెద్ద దీపావళి కానుక. రోజూవారీ నిత్యావసరాలు, వైద్యం, విద్య, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించారు. ఇప్పుడు కిరాణ సామగ్రి చౌక ధరకే లభిస్తుంది. ఆరోగ్య సంరక్షణ ఖర్చు తగ్గుతుంది. విద్య అందుబాటు ధరలో ఉంటుంది. రైతులకు మద్దతు దొరుకుతుంది. మొత్తంగా తదుపరి జీఎస్టీ-జీవన సౌలభ్యంఆర్థిక వ్యవస్థకు ఊతం' అని హర్ష్ గోయెంకా ఎక్స్‌లో పోస్టులో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.భారతదేశ వారసత్వ వ్యాపారంలో ఒక భాగాన్ని సొంతం చేసుకునే అవకాశాన్ని అందిస్తున్న బరోడా %దీబీూ% పరిబాస్ బిజినెస్ కాంగ్లోమరేట్స్ ఫండ్ముంబై, సెప్టెంబర్ 2,2025: భారతదేశంలోని ప్రతిష్టాత్మక వారసత్వ వ్యాపారాల్లో ఒక భాగాన్ని సొంతం చేసుకోవాలని ఎప్పుడైనా ఆలోచించారా? చాలా మంది పెట్టుబడిదారులకు ఈ అవకాశం తీరని కలగానే కనిపిస్తుంది. తరతరాలుగా భారత వ్యాపార సమ్మేళనాలు అసాధారణమైన అనుసరణ, వైవిధ్యీకరణ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ, తమ ఆర్థిక ప్రభావాన్ని నికొనసాగించడానికి మరియు పెంచుకోవడానికి వీలు కల్పించాయిలి. కాలక్రమేణా, ఈ సంస్థలు బహుళ-తరాల సమ్మేళనాలుగా రూపాంతరం చెంది, నేడు భారత ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చే ప్రధాన శక్తులుగా నిలుస్తున్నాయి. ఉప్పు నుంచి ఉక్కు వరకు విస్తరించిన వ్యాపారాలలో డజన్ల కొద్దీ లిస్టెడ్ కంపెనీలను కలిగిన పెద్ద సమ్మేళనాల సందర్భంలో, వాటిలో ఏ కంపెనీ మెరుగైన పనితీరు కనబరుస్తుందో గుర్తించడం చాలా మంది పెట్టుబడిదారులకు సవాలుగా మారుతోంది. పెట్టుబడిదారులు భారతదేశంలోని ఐకానిక్ వ్యాపార సమూహాలలో భాగస్వామ్యం కావడానికి మార్గం చూపుతూ, బరోడా పారిబాస్ బిజినెస్ కాంగ్లోమరేట్స్ ఫండ్‌ను ప్రవేశపెడుతోంది. ఈ ఫండ్ భారత వ్యాపార సమ్మేళనాలలో భాగమైన సంస్థలపై దృష్టి సారించిన వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియో ద్వారా పెట్టుబడి అవకాశాలను అందించడానికి రూపుదిద్దుకుంది. కొత్త ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ కోసం సెప్టెంబర్ 2, 2025న ప్రారంభమై, సెప్టెంబర్ 15, 2025న ముగుస్తుంది. పెట్టుబడిదారులు నెలకు కేవలం ?500 ద్వారా సిస్టమాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ ద్వారా భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ వ్యాపార సమూహాలలో భాగస్వామ్యం కావచ్చు, ఈ సమయంలో ప్రొఫెషనల్ ఫండ్ మేనేజర్లు మరియు విశ్లేషకులు పెట్టుబడికి అనువైన కంపెనీలను ఎంపిక చేస్తారు. "మా బరోడా పారిబాస్ బిజినెస్ కాంగ్లోమరేట్స్ ఫండ్‌ద్వారా పెట్టుబడిదారులు భారతదేశంలో జాబితా చేయబడిన వ్యాపార సమ్మేళనాల్లో బహుళ-తరాల భాగస్వామ్యం సాధించగలరు. ఈ సమ్మేళనాలు సాధారణంగా వైవిధ్యభరితమైన ఆదాయ ప్రవాహాలు, మూలధనానికి సులభమైన ప్రాప్యత, బలమైన బ్రాండ్ ఖ్యాతి మరియు కస్టమర్ ట్రస్ట్ ద్వారా లాభం పొందుతాయి. ఇవి కొత్త వ్యాపార ప్రారంభాలను కూడా ప్రారంభ దశలోనే పోటీ ప్రయోజనంతో మద్దతు చేస్తాయి," అని మిస్టర్ సంజయ్ చావ్లా, చీఫ్ ఇన్వెస్ట్మెంట్ ఆఫీసర్-ఈక్విటీ, బరోడా పారిబాస్ అసెట్ మేనేజ్మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అన్నారు. సమ్మేళనాలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారి, దేశంలోని కొన్ని అతిపెద్ద మరియు అత్యంత విలువైన సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ పథకం %దీూజు% సెలెక్ట్ బిజినెస్ గ్రూప్స్ ఇండెక్స్‌ను బెంచ్‌మార్క్‌గా ఉపయోగిస్తూ, కనీసం నాలుగు వ్యాపార సమ్మేళన సమూహాల్లో పెట్టుబడి పెడుతుంది, ప్రతి గ్రూప్ ఎక్స్‌పోజర్ నికర ఆస్తులలో 25% వద్ద ఉంటుంది.

## కొత్త జీఎస్టీ తర్వాత బంగారం, వెండి ఆభరణాలపై రేట్లు ఎలా ఉంటాయ్..



**న్యూఢిల్లీ-నవభూమి:**మన దేశంలో వచ్చే సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ వేరే లెవెల్‌కి వెళ్లనుంది. ఎందుకంటే ఇటీవల 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతో దేశంలో అనేక మార్పులు రాబోతున్నాయి. ఇప్పటి వరకు ఉన్న 5%, 12%, 18%, 28% నాలుగు శ్లాబ్‌లను తగ్గించి ఇకపై రెండు ప్రధాన జీఎస్టీ రేట్లు 5%, 18%ని అమలు చేయనున్నారు. మరోవైపు కొన్ని ఖరీదైన లగ్జరీ వస్తువులకు ప్రత్యేకంగా 40% ట్యాక్స్ ప్రవేశపెట్టారు. ఇందులో హైఎండ్ కార్లు, సిగరెట్లు, తంబాకు వంటివి ఉన్నాయి. ఇది జీఎస్టీ విధానంలో జరిగిన అతిపెద్ద రిఫార్మ్ అని చెప్పవచ్చు. రోజువారీ గృహ అవసరాలకు సంబంధించిన చాలా ఉత్పత్తులు ఇకపై తక్కువ పన్ను శ్లాబ్‌లోకి వస్తాయి. అంటే అవి చౌకగా దొరకనున్నాయి. కానీ, ఇక్కడ బంగారం, వెండి ఆభరణాలపై మాత్రం జీఎస్టీ రేట్లలో ఎలాంటి మార్పు లేదు. బంగారం, వెండిపై జీఎస్టీ 3% వద్దనే ఉంటుంది. అదనంగా మేకింగ్ చార్జీలపై 5% జీఎస్టీ కూడా అలాగే కొనసాగుతుంది. గోల్డ్ కాయిన్స్, బార్‌లపై కూడా 3% జీఎస్టీనే ఉంటుంది. అంటే కొత్త రిఫార్మ్ వల్ల బంగారం, వెండి డిమాండ్‌పై పెద్దగా ప్రభావం ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రకటన తర్వాత మార్కెట్‌లో కొంత హెచ్చుతగ్గులు కనిపించాయి. గోల్డ్ అక్టోబర్ ఫ్యూచర్స్ 1% కంటే ఎక్కువ తగ్గిపోయి మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో 10 గ్రాములకు రూ.1,06,207 వద్ద ట్రేడైంది. అదే సమయంలో %వీజశ% సిల్వర్ డిసెంబర్ డెలివరీ 1.04% తగ్గి, కిలోకు రూ.1,24,563 స్థాయిలో ఉంది. కొత్త జీఎస్టీ రిఫార్మ్ వల్ల రోజువారీ వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. కానీ బంగారం, వెండి ఆభరణాల ధరల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండదు.

## 8.5 శాతం వడ్డీకి రూ. 40 లక్షల హోంలోన్..

### ఈ ట్రిక్‌తో రూ. 29 లక్షల వడ్డీ ఆదా..!



**న్యూఢిల్లీ-నవభూమి:**సొంతిల్లు కట్టుకోవాలనేది చాలా మంది కల. అయితే ఇది చాలా ఖర్చుతో కూడుకున్నదని చెప్పొచ్చు. అందుకే.. ఇందుకోసం చాలా వరకు హోం లోన్ తీసుకునేందుకు చూస్తారు. అయితే హోం లోన్ అమౌంట్ చాలా ఎక్కువ మొత్తం కావాల్సి ఉంటుంది కాబట్టి ఇక్కడ టెన్యూర్ కూడా ఎక్కువే ఉంటుంది. దీర్ఘకాలం పాటు ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. ఇటీవల ఆర్బీఐ వరుసగా రెపో రేట్లు తగ్గిస్తున్న నేపథ్యంలో.. చాలా బ్యాంకులు హోం లోన్ వడ్డీ రేట్లను భారీగా తగ్గించేశాయి. దీంతో ఫ్లోటింగ్ రేట్ హోం లోన్స్‌పై ఇదివరకు రుణం తీసుకున్న వారికి ఈఎంఐ తగ్గింది లేదా టెన్యూర్ తగ్గింది. కొత్తగా గృహ రుణం తీసుకునే వారికి అంతకుముందు కంటే తక్కువ వడ్డీకే లోన్లు అందుబాటులోకి వచ్చాయి. హోం లోన్ వడ్డీ రేట్లు ఇతర రుణాలతో పోలిస్తే తక్కువే ఉన్నప్పటికీ.. దీర్ఘకాలం పాటు ఈఎంఐ చెల్లించాలి కాబట్టి ఇక్కడ వడ్డీ భారీగా చెల్లించాల్సి వస్తుంది. అందుకే.. మనం కొన్ని ట్రిక్స్ పాటించడం ద్వారా.. ఈ భారాన్ని తగ్గించుకోవచ్చు. ఇక్కడ మనకు ఎన్నో ఆప్షన్స్ ఉంటాయి. వీటిల్లోనే ప్రీపేమెంట్ ఆప్షన్ ఒకటి. అవును.. ఇక్కడ ఏటా కొంత మొత్తం ముందుగానే చెల్లిస్తూ పోతే.. దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో వడ్డీ ఆదా అవుతుంది. దీనిని మనం ఇప్పుడు ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.ని మీరు ఉదాహరణకు 8.5 శాతం వడ్డీకి రూ. 40 లక్షల ఫ్లోటింగ్ రేట్ హోం లోన్ తీసుకున్నారు. ఇక్కడ ఈఎంఐ నెలకు రూ. 32,209 చొప్పున పడుతుంది. ఇంకా మొత్తం టెన్యూర్‌కు వడ్డీ రూపంలోనే రూ. 56.63 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ఇక్కడ మీరు ప్రీపేమెంట్ చేయడం ద్వారా భారీగా ఆదా చేసుకోవచ్చు. ఉదాహరణకు రెండో సంవత్సరం నుంచి ఏటా రూ. 50 వేలు ప్రీపేమెంట్ చేస్తే.. మొత్తంగా మీరు చెల్లించాల్సిన వడ్డీ రూ. 19.52లక్షలు తగ్గుతుంది. 25 ఏళ్ల టెన్యూర్ కాస్తా.. 17 సంవత్సరాల 10 నెలలకు తగ్గుతుంది. అంటే ఏడేళ్ల ముందే లోన్ కూడా క్లోజ్ అవుతుంది. ఇక్కడ మీరు కట్టాల్సిన మిగతా ఈఎంఐ మొత్తాన్ని పెట్టుబడులు చేస్తే ఇంకా ఎక్కువ సంపాదించొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇక్కడ మరో ఏడేళ్ల టెన్యూర్ మిగిలిపోతుంది కదా. అప్పుడు ఈ నెల ఈఎంఐని మ్యూచువల్ ఫండ్ సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తూ పోతే సగటున వార్షిక ప్రాతిపదికన 10 శాతం రిటర్న్స్ ఆశించినా ఇది రూ. 39.58 లక్షలకు చేరుతుందని చెబుతున్నారు. ఇదే మీరు రూ. 1 లక్ష చొప్పున ప్రీపేమెంట్ చేసినట్లయితే ఇంకాస్త ఎక్కువే ఆదా అవుతుంది. ఇక్కడ 25 ఏళ్ల లోన్ కాస్తా.. 14 ఏళ్లలోనే పూర్తవుతుంది. ఇంకా వడ్డీ దాదాపు రూ. 28.56 లక్షలు ఆదా అవుతుంది. ఇక్కడ దాదాపు 11 ఏళ్లు మిగులుతుంది. ఈ కాలంలో చెల్లించాల్సిన ఈఎంఐని సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తే 10 శాతం రాబడి లెక్కన రూ. 75.45 లక్షలు అవుతాయంట. ఇక్కడ మీ ప్రీపేమెంట్ మీ సామర్థ్యాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలి. ఎంత వరకు మీరు కట్టగలరో చూసుకోవాలి. దీని ద్వారా.. మీరు సుదీర్ఘ కాలంలో చెల్లించాల్సిన వడ్డీ తగ్గుతుండటంతో పాటుగా.. అక్కడ ఆదా చేసిన ఈఎంఐని సిప్ ద్వారా పెట్టుబడి పెడితే.. మంచి రాబడి అందుకుంటున్నారని గ్రహించాలి. ఇక్కడే తెలివిగా ఆలోచించాలి.

## వృద్ధి ఉద్యోగాల కల్పనకు ఊతం




**ముంబై-నవభూమి:**ప్రభుత్వం బుధ వారం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎసటీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎసటీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎసటీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు. ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎసటీ నుంచి 18 శాతం జీఎసటీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు. ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎసటీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎసటీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు. ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎసటీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వవనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

## ఇంకా 11 రోజులే టైం..ఐటీఆర్ ఫైల్ చేశారా లేదా




**న్యూఢిల్లీ-నవభూమి:**మీరు ఈ ఏడాది ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేశారా లేదా. ఎందుకంటే ఈ సంవత్సరం ఐటీఆర్ ఫైల్ చేసేందుకు గడువు ఇంకా 11 రోజులు మాత్రమే (సెప్టెంబర్ 15 వరకు) ఉంది సమయం తక్కువ ఉంది కాబట్టి ఇప్పుడే దీని కోసం సిద్ధమవ్వండి. ఆలస్యం అయితే మాత్రం జరిమానా చెల్లించాల్సి వస్తుంది. సెప్టెంబర్ 3, 2025 నాటి డేటా ప్రకారం, దాదాపు 3 కోట్ల మంది ట్యాక్స్‌పేయర్లు ఇంకా తమ ఐటీఆర్ ఫైల్ చేయలేదు. గడువు ముగియడానికి ఇంకా 11 రోజులే మిగిలి ఉంది. సెప్టెంబర్ 15 అనేది ఆడిట్ అవసరం లేని ట్యాక్స్‌పేయర్లకు రిటర్న్ ఫైల్ చేయడానికి చివరి తేదీ. ఈ గడువు దాటితే, ఆలస్య రుసుముతో రిటర్న్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది గడువు మళ్లీ పొడిగించే అవకాశం తక్కువగా ఉందని ఆదాయ పన్ను శాఖ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 2, 2025 నాటికి, 4.45 కోట్ల మంది పన్ను చెల్లింపు దారులు తమ ఐటీఆర్ ఫైల్ చేశారు. అందులో 4.22 కోట్ల మంది తమ రిటర్న్‌లను ఈ-వెరిఫై చేశారు. కానీ, ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఇప్పటివరకు కేవలం 3.04 కోట్ల రిటర్న్‌లను మాత్రమే ప్రాసెస్ చేసింది. అంటే, ఇంకా చాలా రిటర్న్‌లు ప్రాసెసింగ్‌లో ఉన్నాయి. గత ఏడాదితో పోల్చితే?గత సంవత్సరం ఐటీఆర్ ఫైలింగ్ గడువు జూలై 31, 2024. ఆ తేదీ నాటికి 7.41 కోట్ల రిటర్న్‌లు ఫైల్ అయ్యాయి. అందులో 6.17 కోట్లు ఈ-వెరిఫై అయ్యాయి. ఈ ఏడాది గడువు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఫైలింగ్ సంఖ్య ఆ స్థాయికి చేరలేదు. గత ఏడాదితో పోలిస్తే, ఈ ఏడాది కనీసం 3.06 కోట్ల మంది ఇంకా ఫైల్ చేయాల్సి ఉంది. ట్యాక్స్‌పేయర్ల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతున్నందున, ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

## బలమైన పునరుద్ధరణకు సిద్ధంగా దేశీయ డిమాండ్: పీఎల్ క్యాపిటల్




**ముంబై-నవభూమి:** పండుగ సీజన్ తర్వాత కూడా కొనసాగే అవకాశం ఉన్న బహుళ అనుకూలతల కారణంగా దేశీయ డిమాండ్‌లో బలమైన పెరుగుదలకు పరిస్థితులు సిద్ధమయ్యా యని భారతదేశ అత్యంత విశ్వసనీయ ఆర్థిక సేవల సంస్థల్లో ఒకటైన పీఎల్ క్యాపిటల్, "రెడీ ఫర్ నెక్స్ట్ లెగ్ గ్రోత్" అనే తన తాజా ఇండి యా స్ట్రాటజీ రిపోర్ట్‌లో ప్రముఖంగా పేర్కొంది. తక్కువ ద్రవ్యోల్బణం (ఆహార ద్రవ్యోల్బణంతో 1.6% వద్ద సీపీ ఐ), గ్రామీణ ఆదాయాలను పెంచే సాధారణ రుతుపవనాలు, FY26లో ?1,000 బిలియన్ల పన్ను కోతల నుండి ఆర్థిక పెరుగుదల ఈ పునరుద్ధరణకు పునాది వేస్తున్నాయి. ఆర్బీఐ 100 బీపీఎస్ రేటు కోతలు, ఈఎంఐలను తగ్గించడం, గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు డిమాండ్‌ను ప్రేరేపించడంతో 2%H%26లో ఈ ఊపు మరింత బలపడుతుందని భావిస్తున్నారు. దీనికి అనుబంధంగా, వాహనాలు, డ్యూరబుల్స్, స్టేపుల్స్, ఔష ధాలలో పన్ను స్లాబ్‌లను హేతుబద్ధీకరించే, ధరలను తగ్గించే జీఎస్టీ 2.0 సంస్కరణలు విస్తృత ఆధారిత వినియోగాన్ని ప్రేరేపించడానికి సిద్ధంగా ఉన్నాయి. భారతదేశ వృద్ధి పథాన్ని నిలబెట్టడానికి వినియోగ డి మాండ్‌ను పునరుద్ధరించడం చాలా కీలకమని నివేదిక నొక్కి చెబుతుంది. 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికత కింద, జీఎస్టీ సంస్కరణలు, రక్షణ కార్యక్రమాలు, వ్యవసాయానికి మద్దతు, యువత ఉపాధి, ఇంధన భద్రతపై దృష్టి సారించి, ప్రస్తుత యూఎస్ టారిఫ్ సవాలును ఒక పెద్ద /27 సంవత్సరానికి నిఫ్టీ ఈపీఎస్ అంచనాలను -1.4/-0.4 సవరించారు, అయినప్పటికీ FY25-27 కంటే ఆదాయాలు ఇప్పటికీ ఆరోగ్యకరమైన 13.2% సీఏజీఆర్ వద్ద పెరుగుతాయని అంచనా వేయబడింది. ఈపీఎస్ ?1,254/1,445గా అంచనా వేయబడింది. ప్రస్తుతం, నిఫ్టీ 18.9x ఒక సంవత్సరం ముందు ఈపీఎస్ వద్ద ట్రేడవుతోంది, ఇది దాని 15/10-సంవత్సరాల సగటు %PE 19.1x%కి స్వల్పంగా 1% తగ్గింపు. 15-సంవత్సరాల సగటు 19.1ని మార్చి '27 %EPS 1,445కి వర్తింపజేస్తే, మేం 12-నెలల నిఫ్టీ లక్ష్యం 27,609 (ముందు 18.6x FY27 EPS వద్ద 26,889తో పోలిస్తే) పొందుతాం. తదుపరి పునః-రేటింగ్‌కు పరిమిత అవకాశంతో, రక్షణ, మౌలిక సదుపాయాలు, ఈఎంఎస్, ఆసుపత్రులు, విద్యుత్ ప్రసారం వంటి నిర్మాణాత్మక థీమ్‌లు చెక్కుచెదరకుండా ఉన్నాయి.

**జీఎస్టీ 2.0: డిమాండ్ పెంచేలా తక్కువ ధరలు**

2017 జూలై 1న అమలు చేయబడిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) భారతదేశంలో అత్యంత ముఖ్యమైన పన్ను సంస్కరణగా నిలిచింది. బహుళ పరోక్ష పన్నులను ఒకే చట్రం కింద ఏకం చేసింది. అప్పటి నుండి ఇది కేంద్రం, రాష్ట్రాలు రెండింటికీ పరోక్ష పన్ను ఆదాయానికి అతిపెద్ద సహకారిగా మారింది.

## బంగారం .. రూ.1.07 లక్షలు

**న్యూఢిల్లీ-నవభూమి:**పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5న్ల స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25న్ల తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి.

ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు ముమ్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

### 50 కోట్లకు జియో యూజర్లు.. రేపటి నుంచి అందరికీ

## ఫ్రీ అన్‌లిమిటెడ్ డేటా.. బంపర్ ఆఫర్లు




**న్యూఢిల్లీ-నవభూమి:**రిలయన్స్ జియో 9వ వార్షికోత్సవం సందర్భంగా తమ యూజర్లకు బంపర్ ఆఫర్లు ప్రకటించింది. తమ నెట్‌వర్క్ వినియోగదారుల సంఖ్య 50 కోట్ల మార్క్ దాటినట్లు తెలిపింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ ప్రత్యేక ఆఫర్స్ ఇచ్చింది. ప్రస్తుత ప్లాన్ ఆధారంగా యూజర్లు అందరికీ అపరిమిత డేటాను నెల రోజుల పాటు ఉచితంగా అందిస్తామని తెలిపింది. రూ. 349 ఆపైన ప్లాన్లు రీఛార్జ్ చేసుకున్న వారికి సెప్టెంబర్ 5 నుంచి అక్టోబర్ 5 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. అలాగే వార్షికోత్సవ వారంత ఆఫర్ సైతం తీసుకొచ్చింది. వీకెండ్ ఆఫర్‌లో భాగంగా సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అంటే శుక్రవారం, శనివారం, ఆదివారాలు ప్రస్తుత ప్లాన్లతో సంబంధం లేకుండానే 5జీ స్మార్ట్ ఫోన్ కలిగి ఉన్న వారందరికీ ఉచితంగా అన్‌లిమిడెట్ 5జీ డేటా అందిస్తామని జియో తెలిపింది. అలాగే 4జీ యూజర్లు రూ. 39తో రీఛార్జ్ చేసుకోవాలని, ఈ ప్లాన్ ద్వారా ఈ వీకెండ్‌లో అపరిమిత 4జీ డేటాను (రోజుకు గరిష్ఠంగా 3జీబీ) ఉపయోగించుకోవచ్చని తెలిపింది. 3జీబీ వరకు గరిష్ఠ వేగంతో ఇంటర్నెట్ వస్తుంది. ఆ తర్వాత స్పీడ్ తగ్గి లభిస్తుంది.

వార్షికోత్సవ నెల ఆఫర్ రూ. 349 ప్లాన్ ప్రకటించింది. రోజుకు 2జీబీ అంత కంటే ఎక్కువ డేటా ఉన్న ప్లాన్ ఉన్న వారికి సెప్టెంబర్ 5వ తేదీ నుంచి వచ్చే నెల అక్టోబర్ 5వ తేదీ వరకు అపరిమిత 5జీ డేటా లభిస్తుంది. అంటే ప్లాన్‌తో సంబంధం లేకుండా రూ. 349 పైన ఏ ప్లాన్ రీఛార్జ్ చేసుకున్నా ఈ ఆఫర్ పొందవచ్చు. వీటితో పాటుగా జియో హోమ్ 2 నెలల ఫ్రీ ట్రయల్ సైతం లభిస్తుంది. రూ. 349 ప్లాన్ 12 నెలల పాటు వరుసగా రీఛార్జ్ చేసుకుంటే మరో నెల రోజులు ఉచితంగా సేవలందిస్తామని జియో బంపర్ ఆఫర్ ఇచ్చింది. రిలయన్స్ జియో 9వ వార్షికోత్సవం సందర్భంగా రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ మాట్లాడారు. 'జియో తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా 50 కోట్ల మంది యూజర్లు తమపై నమ్మకాన్ని కలిగి ఉండడం గౌరవంగా భావిస్తున్నా. ఈ స్థాయికి చేరడం ద్వారా ప్రతి ఒక్కరి జీవితాల్లో జియో ఎలా ఒక భాగమైందనే విషయాన్ని తెలియజేస్తుంది. ఈ మైలురాయిని చేరుకున్న క్రమంలో ప్రతి ఒక్క వినియోగదారుడికి వ్యక్తిగతంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.' అని పేర్కొన్నారు.

## సెన్సెక్స్ 410 పాయింట్లు అప్




**ముంబై-నవభూమి:**స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎసటీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎసఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90న్ల శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63న్ల ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ శుక్రవారం 05 । సెప్టెంబర్ । 2025

## అల్లు కనకరత్నమ్మ మృతిపై సంతాపం తెలిపిన ప్రధాని మోదీ




టాలీవుడ్ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తల్లి కనకరత్నమ్మ (94) ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసిందే. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె గత శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. అయితే కనకరత్నమ్మ పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. అల్లు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. కనకరత్నమ్మ తన కళ్లను దానం చేయడం గొప్ప విషయం అని కొనియాడారు. ఈ దానం ద్వారా ఆమె అనేక మందికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. అల్లు కుటుంబానికి ఈ కష్ట సమయంలో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అంటూ మోదీ సందేశం పంపారు. ప్రధానమంత్రి తెలిపిన సంతాప సందేశానికి అల్లు అరవింద్ కృతజ్ఞతలు తెలిపారు.

నవచిత్ర



## వీరమల్లు-2.. అలా చూస్తామా?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లాంటి పెద్ద హీరో.. క్రిష్ జాగర్లమూడి లాంటి అభిరుచి ఉన్న దర్శకుడు. ఏఎం రత్నం లాంటి లెజెండరీ ప్రొడ్యూసర్.. ఈ కలయికలో సినిమా అన్నపుడు తెలుగు ప్రేక్షకులు ఎంత ఎగ్జైట్ అయ్యారో. కానీ భారీ అంచనాల మధ్య మొదలై ఒక దశ వరకు మంచి బజ్‌తో సాగిన 'హరిహర వీరమల్లు' సినిమా.. రిలీజ్ కావడమే కష్టం అనుకునే స్థితికి చేరుకుంది. చివరికి అతి కష్టం మీద సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చినా బాక్సాఫీస్ దగ్గర ఆశించిన ఫలితం దక్కలేదు. పవన్ కెరీర్లోనే నిర్మాత, బయ్యర్లకు అత్యధిక నష్టాలు తెచ్చిపెట్టిన సినిమాగా ఇది నిలిచింది. ఐతే క్రిష్‌యే ఈ సినిమాను పూర్తి చేసి ఉంటే.. మొదట అనుకున్న కథతోనే మూవీ తెరకెక్కి ఉంటే ఫలితం వేరుగా ఉండేదనే అభిప్రాయం చాలామందిలో ఉంది. తాజాగా క్రిష్ మాటల్ని బట్టి చూస్తే ఆ అభిప్రాయం మరింత బలపడింది. ఢిల్లీలో ఔరంగజేబు దగ్గరున్న కోహినూర్ వజ్రాన్ని దోచుకురావడం 'వీరమల్లు' సినిమాలో సెకండాఫ్ అయితే.. అదంతా రెండో భాగం కోసం పక్కన పెట్టి మధ్యలో సనాతన ధర్మ పరిరక్షకుడిగా హీరోను చూపిస్తూ వేరే ఎపిసోడ్లు పెట్టి కథను పక్కదోవ పట్టించేశాడు జ్యోతికృష్ణ. 'ఘాటి' ప్రమోషన్లలో భాగంగా క్రిష్.. 'వీరమల్లు' కోసం తాను షూట్ చేసిన 40 నిమిషాల ఎపిసోడ్‌ను రెండో భాగం కోసం పక్కన పెట్టిన విషయాన్ని వెల్లడించాడు. ఆ ఎపిసోడ్ గురించి క్రిష్ చెప్పిన మాటలు వింటే పవన్ ఫ్యాన్స్‌కు గూస్ బంప్స్ వచ్చాయి. నిజంగా ఈ ప్రకారమే కథ నడిచి ఉంటే.. ఆ సీన్లు సినిమాలో ఉండుంటే రిజల్ట్ వేరుగా ఉండేదేమో. ఐతే 'వీరమల్లు' డిజాస్టర్ అయిన నేపథ్యంలో ఇక రెండో పార్ట్ తీసే అవకాశాలు లేనట్లే. మరి క్రిష్ షూట్ చేసిన పెట్టిన హైలైట్ ఎపిసోడ్ సంగతేంటి అన్నది చూడాలి. అది ఏదో ఒక రూపంలో బయటికి వస్తుందని క్రిష్ అన్నాడు. అది ఎలా అన్నదే ఇప్పుడు ప్రశ్న. మరి ఆ ఎపిసోడ్లకు వేరే పేరు పెట్టి మినీ సినిమాలా ఓటీటీలో ఏమైనా రిలీజ్ చేస్తారా.. లేక యూట్యూబ్‌లో వదులుతారా.. అన్నది ఆసక్తికరం. ప్రేక్షకుల్లో కచ్చితంగా దీని మీద ఆసక్తి ఉంటుంది కాబట్టి.. ఆ కంటెంట్ అంతా పక్కన పడేయకుండా ఏదో ఒక రూపంలో రిలీజ్ చేసి నిర్మాత రత్నం ఆ రకంగా అయినా నష్టాలను కొంతమేర భర్తీ చేసుకుంటే మంచిదే.

## బుట్టబొమ్మగా కిస్సిక్ బ్యూటీ



రాఘవేంద్రరావు కొత్త 'పెళ్లి సందడి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమా ఫ్లాప్ అయినా కూడా లక్ కలిసి వచ్చింది. పైగా రాఘవేంద్ర రావు మెచ్చిన హీరోయిన్ కావడంతో ఆ తర్వాత కూడా ఆఫర్లు వచ్చాయి. పెళ్లి సందడితో దక్కని హిట్ రవితేజతో చేసిన 'ధమాకా' సినిమాతో దక్కింది. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. రవితేజ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ చిత్రాల జాబితాలో నిలిచింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో శ్రీలీల ఒక్కసారిగా స్టార్ ఆఫ్ ది టాలీవుడ్‌గా మారింది. ఆకట్టుకునే అందంతో పాటు, డాన్స్‌లో ప్రతిభ ఉన్న హీరోయిన్ కావడంతో శ్రీలీలకు ధమాకా తర్వాత ఒక్కసారిగా ఆఫర్లు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. అదే స్థాయిలో విజయాలు కూడా ఈమెకు దక్కాయి. పాన్ ఇండియా సినిమాలతో బిజీ బిజీ మహేష్ బాబుతో చేసిన గుంటూరు కారం సినిమా నిరాశ పరిచిన మరిన్ని సినిమాలు ఈమె స్థాయిని పెంచాయి. హిట్.. ఫ్లాప్స్ అనే తేడా లేకుండా ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమా ఆఫర్లు దక్కించుకుంది, ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఏడాదికి నాలుగు అయిదు, అంతకు మించి సినిమాలతోనూ ఈ అమ్మడు వచ్చింది. శ్రీలీల ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్‌గా సినిమాలు చేస్తోంది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప 2 సినిమాలో కిస్సిక్ అంటూ ఐటెం సాంగ్ చేయడంతో ఒక్కసారిగా ఈ అమ్మడి క్రేజ్ పెరిగింది. హిందీ, తమిళ్ ఇలా అన్ని భాషల్లోనూ ఈ అమ్మడికి గుర్తింపు దక్కింది. అక్కడ కిస్సిక్ బ్యూటీ అనే పేరును దక్కించుకుంది. అందుకే ఇప్పటికే బాలీవుడ్‌లో ఆషికి 3 సినిమాలో ఛాన్స్ దక్కించుకున్న ఈ అమ్మడు కోలీవుడ్‌లోనూ స్టార్ హీరోకు జోడీగా నటిస్తున్న విషయం తెల్సిందే. అందమైన లుక్‌లో శ్రీలీల సినిమాలతో చాలా బిజీగా ఉన్న శ్రీలీల రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మేకప్ ఆర్టిస్ట్ ఒకరు ఈ వీడియోను షేర్ చేశారు. వీడియోలో శ్రీలీల చాలా అందంగా కనిపించడంతో పాటు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. సాంప్రదాయ వస్త్రాలతో శ్రీలీల ఆకట్టుకుంది. బుట్ట బొమ్మ మాదిరిగా కనిపిస్తున్న శ్రీలీల ను చూస్తూ ఉంటే చూపు తిప్పలేక పోతున్నాం అంటున్నారు. ఒక యాడ్ షూటింగ్ నిమిత్తం ఇలాంటి ఔట్ ఫిట్ లో శ్రీలీల రెడీ అయినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆ యాడ్ ప్రేక్షకుల ముందుకు వస్తుందేమో చూడాలి. సినిమాల్లోనూ అప్పుడప్పుడు ఇలాంటి లుక్ లో కనిపించాలని అభిమానులతో పాటు, సోషల్ మీడియాలో ఈమెను ఫాలో అయ్యే వారు, లైక్ చేసే వారు అంటున్నారు. చెవులకు పెద్ద బుట్టాలు పెట్టి, పెద్ద మాటీలు ధరించడం ద్వారా పద్దతైన అమ్మాయిగా అనిపిస్తుందని, అంతే కాకుండా చీర కట్టు కారణంగా మరింత అందంగా కనిపిస్తుందని అంటున్నారు.

## చీరకట్టులో నడుము అందాలతో గిలిగింతలు పెడుతున్న దివి!



సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత హీరోయిన్స్ చాలామంది తమ గ్లామర్ ఫోటోలను షేర్ చేస్తూ ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడ్డారు. అందులో భాగంగానే భిన్న విభిన్నమైన గెటప్లలో అందాలు ఆరబోస్తూ ఫోటోలకు ఫోజులిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రముఖ హీరోయిన్ దివి వాద్య కూడా తాజాగా ఇన్స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫోటోలను షేర్ చేసింది. అందులో స్వర్గీయ నందమూరి తారక రామారావు బయోపిక్ ఆధారంగా వచ్చిన 'తారకరామం' అనే పుస్తకాన్ని చదువుతూ.. మరొకవైపు తన అందాలతో యువతను కట్టిపడేసింది. స్కై బ్లూ కలర్ చీర కట్టుకున్న ఈమె.. అందులో తన నడుము అందాలను హైలెట్ చేసింది. ముఖ్యంగా బాల్కనీలో నిల్చొని వెనుక నుండి అందాలు చూపిస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. బాల్కనీ నుండి బయట ప్రపంచాన్ని చూస్తూ చల్లని వాతావరణంలో వెచ్చని ఫోజులతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది ఈ ముద్దుగుమ్మ. పైగా "మౌనమేలనోయి?" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. తాజాగా దివి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో.. లవ్ సింబల్స్ తో పాటు హాట్ ఎమోజీలను కూడా షేర్ చేస్తున్నారు. అంతేకాదు "నీకోసం ఇక్కడ వెయిటింగ్" అని ఒక అభిమాని కామెంట్ చేస్తే.. ఇంకొక అభిమాని "బాపు బొమ్మ" అంటూ కామెంట్ చేశారు. మొత్తానికి అయితే ఈమె షేర్ చేసిన కొద్దిసేపటికే వేలల్లో వ్యూస్, కామెంట్స్, లైక్స్ రావడం గమనార్హం. %బాశ్రీంశీ =ముఃం% - వెంకీ కోసం పండగ గర్ల్‌ఫ్రెండ్ ను సెట్ చేస్తున్నారా? ఇక దివి కెరియర్ విషయానికి వస్తే.. బుల్లితెర ప్రేక్షకులలో తనకంటూ ఒక గుర్తింపును సొంతం చేసుకుంది. తెలుగు పాపులర్ రియాల్టీ షో అయిన బిగ్ బాస్ తెలుగు ద్వారా బుల్లితెర ప్రేక్షకులకు పరిచయమైన ఈమె.. ఈ షోతో మంచి ఇమేజ్ అందుకుంది. మరొకవైపు 2019లో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'మహర్షి' లో చిన్న పాత్ర పోషించి వెండితెరకు పరిచయమైంది. ఆ చిత్రంతోనే సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టగా..అక్కడ ఈమెకు మంచి మార్కులే పడ్డాయి. అల్లు అర్జున్ 'పుష్ప 2' సినిమాలో కూడా విలేకరిగా నటించి అందరినీ ఆశ్చర్యపరిచింది.. అలా అప్పటినుంచి సినిమాలు, టీవీ రంగంలో యాక్టివ్ గా కనిపించే ఈమె అప్పుడప్పుడు సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. అంతేకాదు మొన్నా మధ్య ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో కూడా చెప్పుకొచ్చింది. ఆమె మాట్లాడుతూ.. "నన్ను గారాబంగా చూసుకునేవారు నా భర్తగా రావాలి. నాతో ఫ్రెండ్లీగా.. ఎప్పుడూ నన్ను చిన్న పిల్లల చూసుకునే వారంటే నాకు చాలా ఇష్టం. ముఖ్యంగా నన్ను ఒళ్లో కూర్చోబెట్టుకొని లాలించేవారు కావాలి. అలాంటి క్వాలిటీస్ ఉన్న వ్యక్తి నాకు భర్తగా రావాలి" అంటూ ఆమె చెప్పుకొచ్చింది. మరి ఈ జనరేషన్లో దివికి అలాంటి అబ్బాయి ఎక్కడ దొరుకుతారో చూడాలి అని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

## 'కాలేజీలో మ్యాడ్ ఫన్'.. రామ్ కొత్త పాట పప్పీ షేమ్!

టాలీవుడ్ యంగ్ హీరో, ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఇప్పుడు యూత్ ఫుల్ ఎంటర్టైనర్ ఆంధ్రా కింగ్ తాలూకా మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఆ సినిమాకు మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. కన్నడ ప్రముఖ నటుడు ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తుండగా.. ఆయన ఫ్యాన్ గా సినిమాలో రామ్ కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న మూవీకి వివేక్, మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి కాగా.. ప్రస్తుతం మేకర్స్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ను జరుపుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో మేకర్స్.. ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్ లో భాగంగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. నువ్వుంటే చాలే అంటూ రొమాంటిక్ మెలోడీగా సాగిన పాట.. ఎంతో రిఫ్రెషింగ్ గా ఉందని చెప్పాలి. అనిరుధ్ వాయిస్, రామ్ లిరిక్స్, వివేక్- మెర్విన్ సంగీతం స్పెషల్ గా దేనికవే నిలిచి అందరినీ ఆకట్టుకున్నాయి. ఇప్పుడు సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. బీట్ రెడీ.. సింగిల్ రెడీ అంటూ నిన్న పోస్ట్ చేసిన మేకర్స్.. నేడు ఫ్యాన్స్, కాలేజీ, మ్యాడ్ ఫన్ అంటూ పోస్ట్ చేశారు. అయ్యెయ్యో పోయే.. అర్రెర్రే పప్పీ షేమాయే.. అని రాసుకొచ్చి.. సెప్టెంబర్ 8వ తేదీన పప్పీ షేమ్ సాంగ్ రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. రామ్ కొత్త పోస్టర్ ను కూడా విడుదల చేశారు. అయితే పోస్టర్ లో రామ్ ఫుల్ జోష్ లో కనిపించారు. పప్పీ షేమ్ అంటూ సింబల్ చూపిస్తూ ఆకట్టుకున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. రామ్ లుక్ బాగుందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. వెయిటింగ్ ఫర్ సెకండ్ సింగిల్ అని చెబుతున్నారు. కాలేజీలో జరిగే ఫస్ట్ నేపథ్యంలో సాంగ్ ఉంటుందని ఊహిస్తున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. ఇప్పటికే మూవీపై ఆడియన్స్ లో భారీ అంచనాలు ఉన్నాయి. మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్, పోస్టర్స్ కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ కూడా అలరించింది. దీంతో సినిమా హిట్ అవుతుందని అంతా భావిస్తున్నారు. నవంబర్ 28వ తేదీన సినిమాను వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేయనున్నారు మేకర్స్. మరి ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.




## కెరీర్ బెస్ట్ మూవీ ఏంటో చెప్పిన ఘాటి డైరెక్టర్ క్రిష్



లాంగ్ గ్యాప్ తర్వాత లేడీ ఓరియెంటెడ్ సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసేందుకు వస్తోంది టాలీవుడ్ బ్యూటీ అనుష్కా శెట్టి . క్రిష్ దర్శకత్వంలో అనుష్క నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఘాటి. సెప్టెంబర్ 5న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మరికొన్ని గంటల్లో సినిమా థియేటర్లలో సందడి చేయనుంది. కాగా ప్రమోషన్స్‌లో డైరెక్టర్ క్రిష్ ఆసక్తికర విషయం ఒకటి షేర్ చేశాడు. విభిన్నమైన స్టోరీ టెల్లింగ్‌తో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయడంలో క్రిష్ స్టైలే వేరని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటివరకు తాను తెరకెక్కించిన చిత్రాల్లో ఉత్తమ సినిమా ఎన్టీఆర్ బయోపిక్ అన్నాడు క్రిష్. ప్రమోషనల్ ఇంటర్వ్యూలో క్రిష్ మాట్లాడుతూ.. లెజెండరీ యాక్టర్, పొలిటిషియన్ నందమూరి తారక రామారావు జీవిత కథపై పనిచేయడం గౌరవంతోపాటు గొప్ప బాధ్యత అని చెప్పుకొచ్చాడు. అంతేకాదు ఎన్టీఆర్ బయోపిక్ సృజనాత్మకంగా, భావోద్వేగపూరిత అంశాల పరంగా తనకు చాలా చాలెంజ్ విసిరిందని అన్నాడు. అంతేకాదు బాలకృష్ణ కెరీర్‌లోఉత్తమ నటనను కనబరిచిన సినిమా ఇదన్నాడు.యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో చైతన్య రావ్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన జనాలంతా కొండ ప్రాంతం మధ్యలోని దారి వెంట మూటలు మోసుకొని వెళ్తున్న లుక్‌తోపాటు గ్లింప్స్ సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఘాటి అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కానుంది.

## అలా జరిగితే నాకు మరణమే.. ఆ మ్యాచ్ కోసం అన్ని రూల్స్‌నూ బ్రేక్ చేశాం..




**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ వెనుకున్న మాస్టర్ మైండ్ లలిత్ మోదీ. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన లీగ్‌ను ప్రారంభించి, దానిని విజయవంతం చేయడం వెనుక లలిత్ మోదీ కీలక పాత్ర పోషించారు. అయితే ఆయన మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటూ చాలా కాలం నుంచి లండన్‌లోనే నివసిస్తున్నారు.

2008: అలా జరిగితే నాకు మరణమే.. ఆ మ్యాచ్ కోసం అన్ని రూల్స్‌నూ బ్రేక్ చేశాం..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ వెనుకున్న మాస్టర్ మైండ్ లలిత్ మోదీ క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన లీగ్‌ను ప్రారంభించి, దానిని విజయవంతం చేయడం వెనుక లలిత్ మోదీ కీలక పాత్ర పోషించారు. అయితే ఆయన మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటూ చాలా కాలం నుంచి లండన్‌లోనే నివసిస్తున్నారు. చాలా కాలం సైలెంట్‌గా ఉన్న లలిత్ మోదీ ఇటీవల సోషల్ మీడియాలో యాక్టివ్ అయ్యారు. ఇటీవల హర్భజన్-శ్రీశాంత్ చెంపదెబ్బ ఎపిసోడ్ గురించి వెల్లడించి సంచలనం సృష్టించారు ఐపీఎల్ ప్రారంభమైన 2008 సీజన్ తొలి మ్యాచ్ గురించి లలిత్ మోదీ తాజాగా మాట్లాడారు. 'తొలి మ్యాచ్ పైనే ఐపీఎల్ భవితవ్యం ఆధారపడి ఉంటుందని అర్థమైంది. ఆ మ్యాచ్ విజయవంతం కాకపోతే నేను మరణించినట్టే అని భావించా. ఆ మ్యాచ్‌ను విజయవంతం చేయడం కోసం ఎన్నో రూల్స్‌ను బ్రేక్ చేశా. ఆ సీజన్ బ్రాడ్‌కాస్టింగ్ కోసం సోనీతో ఒప్పందం కుదుర్చుకున్నాం. అయితే సోనీకి దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ లేదు. కానీ, తొలి మ్యాచ్‌ను ప్రతి ఒక్కరూ చూడాలని నేను భావించా'ని లలిత్ తెలిపారు.

## ఈడీ ముందుకు శిఖర్ ధవన్.. బెట్టింగ్ యాప్ కేసులో విచారణ..



**న్యూఢిల్లీ-నవభూమి:** బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన క్రికెటర్లు, సెలబ్రిటీలు చిక్కులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బెట్టింగ్ వ్యవహారం దుమారం రేపుతోంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన పలువురు సెలబ్రిటీలు ఇప్పటికే విచారణ ఎదుర్కొన్న విషయం తెలిసిందే.దేశవ్యాప్తంగా బెట్టింగ్ యాప్స్ వ్యవహారం ప్రస్తుతం దుమారం రేపుతోంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన పలువురు క్రికెటర్లు, సెలబ్రిటీలు చిక్కులు ఎదుర్కొంటున్నారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన పలువురు సెలబ్రిటీలు ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తాజాగా టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధవన్ కూడా ఆ జాబితాలో చేరాడు. విచారణకు రావాల్సిందిగా శిఖర్ ధవన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నోటీసులు జారీ చేశారుధవన్ గతంలో 1 అనే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేశాడు ధవన్. ఆ యాప్‌నకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని ధవన్‌కు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులను ఇటీవలి కాలంలో ఈడీ ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. కొన్ని బెట్టింగ్ యాప్స్ రూ.కోట్లల్లో మోసాలకు పాల్పడడంతోపాటు భారీ మొత్తంలో పన్ను ఎగవేసినట్లు ఆరోపణలున్నాయి

నవక్రీడ

## కోహ్లీ పాస్.. లండన్‌లో టెస్ట్‌కు అనుమతి ఇవ్వడంపై ఫ్యాన్స్ ఆగ్రహం..



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా స్టార్ ప్లేయర్స్ రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత తిరిగి మైదానంలో అడుగుపెట్టబోతు న్నారు. వీరిద్దరూ ఇప్పటికే టీ-20, టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వీరు ఇకపై టీమిండియా తరపున వన్డేలు మాత్రమే ఆడబోతున్నారు. అక్టోబర్‌లో టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటించ బోతోంది. టీ-20 సిరీస్‌తో పాటు వన్డే సిరీస్ కూడా ఆడనుంది. ఈ వన్డే సిరీస్‌లో రోహిత్, కోహ్లీ పాల్గొనబోతున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియా ఆటగాళ్లందరికీ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ లో బీసీసీఐ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తోంది . ఇప్పటికే సూర్యకుమార్ యాదవ్, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా తదితరులు ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరై పాసయ్యారు. అయితే లండన్‌లో ఉంటున్న కోహ్లీ మాత్రం ఈ పరీక్ష కోసం భారత్‌కు రాలేదు. కోహ్లీ చాలా కాలంగా కుటుంబంతో కలిసి లండన్‌లోనే నివసిస్తున్న సంగతి తెలిసిందే ఈ నేపథ్యంలో లండన్‌లోనే కోహ్లీకి ఫిట్‌నెస్ టెస్ట్‌కు హాజరయ్యేందుకు బీసీసీఐ అనుమతినిచ్చిం దట. దీంతో కోహ్లీ లండన్‌లోనే ఆ టెస్ట్‌కు హాజరై తన ఫిట్‌నెస్ టెస్ట్‌లో పాసయ్యాడు. కోహ్లీకి ప్రత్యేకంగా ఇలాంటి అనుమతిని ఇవ్వడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతు న్నాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**